ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 20 ఆగస్టు 2025 | 5





నేడు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

వర్చువల్‌గా సీఎం.. మంత్రులు నిమ్మల, కందుల హాజరు





ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు సమీపంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌ఐటీహెచ్)ని బుధవారం సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్ ప్రత్యక్షంగా హాజరై శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ముఖాముఖి కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఏర్పాటుచేశారు. ఇక్కడ 147 పరిశ్రమల ప్రతినిధులు, 85 స్టార్టప్‌ల ఔత్సాహికులు, 950 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్ ప్రశాంతి మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆర్‌టీఐహెచ్ ద్వారా కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ యాక్సిలరేషన్, పెట్టుబడి, ఫైనాన్సింగ్ వంటి అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువత, పారిశ్రామికవేత్తలు తమ ప్రతిభను ప్రదర్శించుకొనే హబ్‌గా ఆర్టీఐహెచ్ ఉపయోగపడనుందని చెప్పారు. ఆర్టీఐహెచ్ నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలోని ఏర్పాట్లపై సమీక్ష చేసి సమన్వయ శాఖలతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణ నాయక్, డీఆర్డీఏ పీడీ మూర్తి పాల్గొన్నారు.

చేతికి 'స్మార్ట్'గా..





ఈనెల 25 నుంచి ఉమ్మడి జిల్లాలో కొత్త స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. పాత, కొత్త లబ్ధిదారు లందరికీ కలిపి ఒకేసారి వీటిని నియోజకవర్గాలు, మండలాల్లో అందించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ ఫొటోతో చాంతాడంత రేషన్‌కార్డు జారీ చేసి వైసీపీ సొంత ప్రచారం చేసుకుంది. దీని స్థానంలో ఇప్పుడు కొత్తగా ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డు ఇవ్వబోతోంది. అచ్చం ఏటీఎం కార్డు తరహాలో ఉండే కార్డులపై కేవలం లబ్ధిదారుడి పేరు, ఫొటో మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. అలాగే కొత్త కార్డుదారులకు సైతం ఈనెల నుంచే రేషన్ పంపిణీ చేయనున్నారు.

- కొత్త స్మార్ట్ రేషన్ కార్డులొచ్చేస్తున్నాయ్
- ఈనెల 25 నుంచి మండలాల వారీగా పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 17.41 లక్షల పాతకార్డుల స్థానంలో కొత్తవి అందజేత
- ఇటీవల దరఖాస్తు చేసుకున్న వారిలో 34 వేల మంది కొత్త లబ్ధిదారులకూ
- కార్డులపై లబ్ధిదారుడి ఫొటో, కుటుంబ సభ్యుల పేర్లు.. కొత్తవారికీ రేషన్
- ఏటీఎం కార్డు తరహాలో ఉండే రైస్‌కార్డులపై క్యూఆర్ కోడ్‌లు కూడా

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలు పేరుతో ఎడాపెడా లబ్ధిదారులను కోసేశారు. రకరకాల నిబంధనల పేరుతో చివరకు రేషన్‌కార్డులను సైతం భారీగా ఏరేశారు. పలు పథకాలకు రేషన్‌కార్డు అర్హత కావడంతో పెరిగిన ఆర్థిక భారాన్ని తప్పించుకోవడానికి కార్డులను గుట్టుచప్పుడు కాకుండా అప్పటి ప్రభుత్వం ఏరేసింది. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 15.69లక్షల తెల్లకార్డులుండగా, వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లాల పౌరసరఫరాలశాఖలకు పంపి గుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి కార్డులు రద్దుచేసింది. 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో వాటినీ రద్దు చేసేశారు. కొత్తగా వివాహం అయిన దంపతులు, కార్డు ఉండి కొత్తగా పిల్లలున్న వారు ఇలా అనేక విభాగాల్లో కార్డులు జారీ చేయడం, మార్పులు చేర్పులు చేయాల్సి ఉన్నవి వేలల్లో ఉన్నా అదేం పట్టించుకోలేదు. చిరుద్యోగాలు చేసుకునేవారు తమ తల్లిదండ్రుల కార్డుల్లోంచి తమపేర్లు తొలగించాలని కోరినా ఏవేవో కారణాలు చూపి పథకాలను నిలిపివేసింది. దీంతో జనం రేషన్ కార్డుల విషయంలో పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అనేకసార్లు ప్రజలు అప్పట్లో గ్రీవెన్స్‌సెల్‌లో కూడా భారీగా కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్తవి మంజూరు చేయాలంటూ వినతులు అందించినా జగన్ సర్కారు చెవికెక్కించుకోలేదు. మరోపక్క అప్పట్లో ఉన్న రేషన్‌కార్డులను రద్దుచేసి ఏకంగా అప్పటి సీఎం జగన్ ఫొటోతో కార్డులు జారీచేసింది. ప్రతి కార్డుదారుడికి జగన్ ఫొటోతో కాగితం ముక్క చేతిలో పెట్టింది. తద్వారా రాజకీయంగా ఈ కార్డుల ద్వారా లబ్ధిపొందేందుకు ప్రయత్నించింది. అయితే ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టడానికి పచ్చజెండా ఊపారు. అదే సమయంలో రేషన్‌కార్డులను స్మార్ట్ కార్డుల రూపంలో జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర అధికారులు కలిపి ప్రభుత్వ ఆమోదంతో స్మార్ట్‌కార్డుల జారీకి నిర్ణయించారు. ఈ కొత్తకార్డులపై గత ప్రభుత్వం తరహాలో సీఎం బొమ్మ లేకుండా కేవలం కార్డుదారుడి ఫొటోలే ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్డులపై కార్డుదారుడి పేరు, చిరునామా, మిగిలిన సభ్యుల పేర్లు ఉండేలా వీటిని తీర్చిదిద్దారు. ప్రస్తుతం వీటి ముద్రణ దాదాపు పూర్తయింది. వీటిని ఈనెల 23లోగా జిల్లాలకు ప్రభుత్వం పంపనుంది. వీటిని ఈనెల 25 నుంచి జిల్లా స్థాయిలో మంత్రి, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అటు మండలాల్లోను సమాంతరంగా కొత్తస్మార్ట్‌కార్డులను లబ్ధిదారులకు అందించనున్నారు. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో 6,41,533, తూర్పుగోదావరి జిల్లాలో 5,63,089, కోనసీమ జిల్లాలో 5,36,575 కార్డుదారులున్నారు. వీరందరికి కొత్తస్మార్ట్ కార్డులు అందజేయనున్నారు.

మరో 34 వేల మందికి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంత మొత్తుకున్నా పేదలకు కొత్త రేషన్‌కార్డుల జారీ పెద్దగా ఇవ్వలేదు. మార్పులు, చేర్పులను సైతం పట్టించుకోలేదు. దీంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొత్తకార్డులకు ప్రభుత్వం మే 14 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డుల కోసం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించింది. కొత్తగా వివాహం అయినవారు, ఇప్పటివరకు రేషన్‌కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైనవారు.. ఇలా ఏడు రకాల సేవల కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డులు కావాలంటూ వేలాదిమంది దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఉన్నాయి. వీటన్నింటిని సచివాలయాల స్థాయిలో వీఆర్వో నుంచి తహశీల్దార్ల వరకు ఆ అర్జీలను పరిశీలించి మార్పులు చేర్పుల ప్రక్రియ పూర్తి చేశారు. అందులోభాగంగా కాకినాడ జిల్లాకు కొత్తగా 13 వేలు, కోనసీమ 11 వేలు, తూర్పుగోదావరి 10 వేల కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరుచేసింది. వీరికి కూడా ఈనెల 25 నుంచే స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. అటు రేషన్ కూడా ఈ నెల్లోనే కొత్తకార్డుదారులు పొందవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోపక్క కొత్త రేషన్‌కార్డులను రైస్‌కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. వీటిని పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటికి క్యూ ఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలు ఎలా ఉన్నాయి? డబ్బులు అడుగుతున్నారా? వంటి ఫిర్యాదులను సైతం క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తెలపవచ్చు. ఎలాంటి ప్రచార్భాటం లేకుండా ప్రభుత్వ చిహ్నంతో కార్డుల అందజేతపై హర్షం వ్యక్తమవుతోంది.

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు సముద్రంలోకి విడుదల చేసిన వరద నీటి ప్రవాహం

తగ్గుతూ.. పెరుగుతూ..

- ఎగువన పెరుగుతుండగా ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం
- ఎగువన ప్రాణహిత, ఇంద్రావతి నుంచి వస్తున్న వరదనీరు
- ధవళేశ్వరం వద్ద 10 లక్షల క్యూసెక్కుల వరకు రావచ్చని అంచనా

6

వరద సహాయక చర్యలకు ఒక్కో జిల్లాకు రూ.కోటి



ధవళేశ్వరంలో బ్యారేజీపై వరద సరళిని కలెక్టర్ ప్రశాంతికి వివరిస్తున్న ఇరిగేషన్ అధికారులు

వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

ధవళేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల గోదావరికి వరద తరలివస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం కలెక్టర్ పి.ప్రశాంతి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీని సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ గోపినాథ్, హెడ్ వర్క్స్ ఈఈ శ్రీనివాసరావు వరద పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల గోదావరికి వరద తాకిడి పెరిగిందని, మరో రెండు రోజుల్లో మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద ప్రవాహం చేరుకోవచ్చన్నారు. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే పునరావాస కేంద్రాల్లో రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి యంత్రాంగం అప్రమత్తంగా ఉందని ఆమె చెప్పారు.

గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరదలు పెరుగుతున్నందున గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజమహేంద్రవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీకి వరదనీరు 8.29 లక్షల క్యూసెక్కుల పైనే వస్తోందన్నారు. తక్షణమే గోదావరి నది వద్ద ప్రస్తుత నీటిమట్టం, ప్రవాహ వేగం వంటి వాటిని దృష్టిలో పెట్టుకుని నదిలో ప్రమాదకర ప్రదేశాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. తెలంగాణలో కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయడంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ప్రజలెవ్వరు నదిలోపలికి వెళ్లి స్నానాలు చేయొద్దని, యువత సెల్ఫీలు దిగేందుకు నదీ సమీపానికి వెళ్లడం వంటి పనులు చేయొద్దని మంత్రి సూచించారు.



సహస్ర ఘటాభిషేకం

కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఉన్న శ్రీలలితాపార్వతీ సమేత గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రావణమాసం ఏకాదశి, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గోష్పాదేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం చేశారు. ఆ దృశ్యమే ఇది..



రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఖైదీతో మాట్లాడుతున్న ఈగల్ చీఫ్ ఐజీ ఆకే రవికృష్ణ

4,200 మంది ఎన్డీపీఎస్‌లో జైలుకెళ్లారు : ఈగల్ ఐజీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఇప్పటివరకు 4,200 మంది జైలుకు వెళ్లి బయటకు వచ్చిన వాళ్లు ఉన్నారని, వారిలో మౌలికమైన మార్పులు తీసుకొచ్చే విధంగా ప్రయత్నిస్తున్నామని ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కేంద్ర కారాగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు జిల్లాల్లోని జైళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నామన్నారు. జైలు నుంచి బయటకు వచ్చాక చట్టబద్ధమైన జీవనం, ఎన్‌డీపీఎస్ తదితర కఠిన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. చట్టాలపై అవగాహన లేకపోవడంతో ఎక్కువగా గంజాయి కేసుల్లో ఇరుక్కుంటున్నారన్నారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది విద్యార్థులకు ఎన్‌డీపీఎస్ చట్టంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించే కృషి చేస్తున్నామన్నారు. చాలామంది ఇంజనీరింగ్ విద్యార్థులు గంజాయి కేసుల్లో నమోదు కావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. 375 గ్రామాలను గుర్తించి డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి అవగాహన కల్పించామన్నారు. గంజాయి కేసుల్లో జైలుకెళ్లొచ్చినా మార్పు రాకపోవడంతో 12 కేసుల్లో రూ.13 కోట్ల ఆస్తులను జప్తు చేశామన్నారు. ఈగల్ ఎస్పీ కె.నగేశ్‌బాబు, జైలు సూపరింటెండెంట్ రాహుల్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ పీవీ సూర్య మోహనరావు పాల్గొన్నారు.

ఇవిగో డ్రెడ్జర్లు



కోటిలింగాల రేవులో ఇసుక ర్యాంపు

- టాస్క్‌ఫోర్స్ ఎక్కడ?
- రాత్రుల డ్రెడ్జింగ్ ఇసుకే.. గోదావరి ఒడ్డున గుట్టలు
- ఆగని ఇసుక అక్రమాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక అక్రమాలు ఆగడం లేదు. ఒకపక్క గోదావరికి వరద వస్తున్నా ఇసుక తవ్వకాలు ఆపడం లేదు. పైగా నిబంధనలకు విరుద్ధంగా పదుల కొద్దీ డ్రెడ్జింగ్ బోట్లలో ఇసుక తవ్వేస్తున్నారు. రాత్రుల సమయంలో డ్రెడ్జింగ్ చేసి, గోదావరి గట్టునే పోగులు పెడుతున్నారు. పైగా డ్రెడ్జర్లను ఆయా ర్యాంపుల సమీపంలోని గోదావరి నది ఒడ్డున చెట్ల చాటున పెడుతున్నారు. కాతేరు, కోటిలింగాల, కొవ్వూరు ఫోర్త్ బ్రిడ్జి సమీపంలోనూ, వెంకటనగర్, గాయత్రీ ర్యాంపులలో యథేచ్ఛగా డ్రెడ్జింగ్ జరుగుతోంది. కొద్దిరోజుల కిందటే మైన్స్ అధికారులు గాయత్రీ, కోటిలింగాల ర్యాంపులలో డ్రెడ్జింగ్ బోట్లను దాడి చేసి పట్టుకుంటే, వాటిని స్వాధీనం చేసుకోవడానికి ఇరిగేషన్ అధికారులు, కేసులు పెట్టడానికి పోలీసులు ఎంత డ్రామా నడిపారో అందరికీ తెలిసిందే. చివరకు గాయత్రీ ర్యాంపులలో పట్టుకున్న డ్రెడ్జింగ్ బోట్లు, వాటికి సంబంధించిన వారిపై వన్‌టౌన్ కేసు నమోదైంది. కోటిలింగాల పేటలో అధికంగా డ్రెడ్జింగ్ బోట్లు దొరికినా త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేయడానికి రోజులు గడిపారు. తర్వాత వాటి పరిస్థితిపై ఎవరూ నోరు మెదపలేదు. తర్వాత అయినా అక్రమాలు ఆగాయా అంటే ఆగలేదు. ప్రస్తుతం ఫోర్త్ బ్రిడ్జి మీద నిలబడి కాతేరు, వెంకటనగర్, కోటిలింగాల వైపు ఒకసారి చూస్తే చాలు. పెద్దపెద్ద డ్రెడ్జింగ్ బోట్లు ఒడ్డు పక్కన నీటిలో కనిపిస్తున్నాయి.అక్కడే ఒడ్డుమీద పెద్ద ఇసుక గుట్టలు కనిపిస్తున్నాయి. డీ సిల్టేషన్‌కు అనుమతి ఉంది. ఇసుక తీసుకోవచ్చు. కానీ పడవల మీద వెళ్లి మనుషులతో ఇసుక తీయాలి. దానికి ఖర్చుతో పాటు ఆలస్యం అవుతుందనే కారణంతో ఏవిధమైన అనుమతి లేకుండానే సుమారు 75 డ్రెడ్జర్లను గోదావరిలో డ్రెడ్జింగ్‌కు వినియోగిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు కనీసం స్పందించి ఒకసారి ఆయా ర్యాంపులలోకి వెళ్లి పరిశీలిస్తే అనేక డ్రెడ్జర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడతాయి. నిజానికి అధికారికంగా ప్రభుత్వం నుంచి డ్రెడ్జింగ్‌కు అనుమతి వస్తే ఎవరు ఎలా తవ్వుకున్నా ఎవరికీ ఇబ్బంది ఉండదు. ఇలా అక్రమంగా తవ్వడంతో ప్రజలు రకరకాలుగా విమర్శలు చేస్తున్నారు. ప్రస్తుతం కొవ్వూరు, కాతేరు, వెంకటనగర్, కోటిలింగాల గాయత్రీ ర్యాంపులలో డ్రెడ్జింగ్ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం ఉన్న వరదను కూడా లెక్కచేయకుండా రాత్రుళ్లు డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుకను తోడేస్తున్నారు. ఒక పక్క ఇసుక అమ్మకాలు పెద్దగా లేవని చెబుతున్నారు.కానీ తవ్వకాలు ఆగడం లేదు. మరి ఇసుక అంతా ఎక్కడికి పోతోందో వారే చెప్పారు. ప్రభుత్వం అనుమతించిన స్టాక్ పాయింట్లలో లక్షల కొలదీ టన్నుల ఇసుక ఉంది. కొవ్వూరు వైపు పాపికొండల మాదిరిగా ఇసుక స్టాక్ పాయింట్లు అందరికీ కనిపిస్తూనే ఉన్నాయి.



గాయత్రీ ఇసుక ర్యాంపులో ఎగుమతులు

వర్షాల సమయంలో విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పడుతున్న వర్షాల వల్ల తలెత్తే విద్యుత్ సమస్యలపై ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షం కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగల సమీపాల్లో ఉండరాదని తెలిపారు. తడి చేతుల్లో కరెంటు స్విచ్ ఆన్ ఆఫ్ చేయరాదని, ఇళ్లలో తడినేలపై విద్యుత్ తీగలు, పరికరాలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడివుంటే వాటిని తాకవద్దని, వెంటనే 1912 నెంబరుకి సమాచారం ఇవ్వాలని, వర్షంలో చెట్లు పడినప్పుడు, కరెంట్ తీగలు పడినప్పుడు వాటి దగ్గరకు వెళ్లరాదని, విద్యుత్ స్తంభాల వద్ద గుడారాలు, షెడ్‌లు, టెంట్లు వేయకూడదని, వర్షాకాలంలో మోటారు వినియోగాన్ని తగ్గించుకోవాలని, ఇంట్లో ఫ్యూజ్ లైన్లు సరిగ్గా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని సూచించారు.

214.2 మీమీ వర్షపాతం

అల్పపీడన ప్రభావంతో మంగళవారం జిల్లాలో 214.2 మీమీ వర్షం కురిసింది. గోకవరం మండలంలో అత్యధికంగా 32.2 మీమీ వర్షం కురిసింది. నల్లజర్లలో 28.0 మీమీ, ఉండ్రాజవరంలో 25.4 మీమీ, పెరవలిలో 21.8 మీమీ, తాళ్లపూడి 21.4 మీమీ, కోరుకొండ 14.4 మీమీ, రాజానగరంలో 12.6మీమీ, నిడదవోలులో 10.2 మీమీ, గోపాలపురంలో 9.8మీమీ, సీతానగరంలో 9.0 మీమీ, రంగంపేటలో 8.4 మీమీ, దేవరపల్లిలో 7.8 మీమీ, చాగల్లులో 3.6 మీమీ, అనపర్తిలో 3.0 మీమీ, కడియంలో 2.8మీమీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 1.6 మీమీ, రాజమహేంద్రవరంలో 1.4 మీమీ, బిక్కవోలులో 0.4 మీమీ, కొవ్వూరులో 0.4 మీమీ వర్షం కురిసింది. సగటున 11.3 శాతం పడింది.

రాగోలపల్లి సొసైటీ కార్యదర్శి భాస్కరరావు సస్పెన్షన్

తాళ్లపూడి, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం రాగోలపల్లి సొసైటీ కార్యదర్శి కింతాడ భాస్కరరావును సస్పెండయ్యారు. కొవ్వూరు డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఆదేశాలు జారీ చేశారని సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్ తెలిపారు. ఇంచార్జి కార్యదర్శిగా తాళ్లపూడి సొసైటీ కార్యదర్శి బి.రామచంద్రాన్ని నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయని, ఆయన మంగళవారం బాధ్యతలు తీసుకున్నారని చెప్పారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ వివరాలు తెలియజేశారు. కార్యదర్శి భాస్కరరావు సొసైటీ పరిపాలనలో బంగారు రుణాలు, రైతులకు ఇచ్చిన రుణాల విషయంలో అవకతవకలకు పాల్పడడంతోపాటు సొసైటీ కార్యకలాపాల్లో నిర్లక్ష్యం తదితర అంశాలపై వచ్చిన ఆరోపణలతో డీఎల్‌సీవో ఆదేశాలతో సస్పెండ్ చేశారని తెలిపారు. గత నెలలో రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సొసైటీలో జరిగిన అవకతవకలపై బ్యాంకు ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో సెక్షన్ 51 ప్రకారం విచారణ సాగుతోందని సొసైటీలో ఆడిట్ చేస్తున్న కె.సుబ్బారావు తెలిపారు. విచారణ సమయంలోనే అవకతవకలకు పాల్పడ్డ కార్యదర్శిని తొలగించాలని, నూతనంగా పదవిలోకి వచ్చిన త్రీమెన్ కమిటీ.. అధికారులను కోరడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు డీఎల్‌సీవో వెంకటరమణ జారీచేశారని తెలిపారు. విచారణ అనంతరం కార్యదర్శి కింతాడ భాస్కరరావుపై చర్యలు తీసుకుంటారని ఆడిటర్ సుబ్బారావు తెలిపారు. కొత్త పదవీ బాధ్యతలు చేపట్టిన తాము రైతుల శ్రేయస్సు కోసమే పనిచేస్తామని అనపర్తి ప్రసాద్, కమిటీ సభ్యుడు బాలం చంద్రరావు తెలిపారు.



వివరాలు తెలియజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్, బ్యాంక్ ఆడిటర్ కె సుబ్బారావు

దోమలు.. యమ డేంజర్!



నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి):

చిన్నదోమ ఎంతో పెద్ద ప్రమాదాన్ని తీసుకువస్తుందో చెప్పడానికి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా లాంటి జ్వరాలే ఉదాహరణ. పట్టణాలతో పాటు పల్లెల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవలకాలంలో డెంగీ, మలేరియా కేసుల సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగాల బారిన పడిన వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రపంచానికి ఉమ్మడి శత్రువుగా మారిన దోమల ఆట కట్టించడానికి సర్‌రోనాల్డ్ రాస్ శతాబ్దం క్రితమే రంగంలోకి దిగారు. 1897లో ఆయన దోమల ద్వారానే మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని నిర్ధారించారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఈ సందర్భంగా ఆగస్టు 20న అంతర్జాతీయ దోమల నివారణ దినోత్సవంగా లండన్ స్కూల్ ఆఫ్ హైజెనిక్ అండ్ ట్రాపికల్ మెడిసన్ ప్రకటించింది. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

- ప్రాణాంతక వ్యాధులకు కారకాలు
- నివారించకపోతే ప్రమాదమే
- లార్వా, ప్యూపా దశలోనే నాశనం చేస్తేనే మంచిది



దోమలు అరికట్టేదేలా?

దోమ ఎగురుతున్నప్పుడు పట్టుకోవడం, చంపడం కష్టమైన పని. ఒక్క దోమను పట్టుకోవాలంటే ఎంతో శ్రమించాలి. దోమలు నీటిలో లార్వా, ప్యూపా దశలో పెరుగుతున్నప్పుడు నాశనం చేయడం సులువు. ఇవి ఇంటిలో నీటిని నిల్వ చేసే కుండీల్లో చిన్నచిన్న పురుగుల్లా కనిపిస్తుంటాయి. వాటిని చాలా మంది నీటిపురుగులు, జలగలు అని కూడా పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు లార్వా నిల్వ నీటిలో ఉన్నట్లయితే ఆ నీటిని మట్టిలేదా ఇసుకలో పారబోయాలి.ఇలా చేయడంవల్ల లార్వా,పూప్యా దశల్లో ఉన్న వాటిని వందల సంఖ్యల్లో నాశనం చేయవచ్చు. దోమలు నిల్వఉన్న నీటిలో గుడ్లు పెడతాయి. ఒక దోమ 100 నుంచి 200 వరకు గుడ్లను పెడుతుంది. ఇవన్నీ కేవలం 8 నుంచి 10 రోజుల్లోగా దోమలుగా మారిపోతాయి. గుడ్డు నుంచి లార్వా ప్యూపా, అడల్ట్ మస్కిటోగా రూపాంతరం చెందుతుంది. దోమలు వ్యాప్తి చెంది చిన్న, పెద్ద తేడా లేకుండా రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతినెల నిత్యావసరాల మాదిరిగానే లిక్విడ్స్, మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ లేదా మస్కిటో బ్యాట్ వంటి వాటికి ఖర్చుచేస్తున్నారు. దోమకాటుకు గురైన వ్యక్తి రోగాల బారిన పడడంతో ఆస్పత్రుల పాలై వేల కు వేలు ఖర్చు చేయక తప్పడంలేదు.

ఆడదోమలే ప్రమాదకరం

మగదోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతాయి. ఆడదోమలు మాత్రం సంతానాభివృద్ధిలో భాగంగా గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీలుస్తాయి. ఈక్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ రక్తాన్ని పీల్చినప్పుడు రక్తంతోపాటు వ్యాధికారకమైన పారాసైట్ దోమ లాలాజల గ్రంథుల్లోకి చేరుతుంది.ఈ పారాసైట్‌లో కొన్నిమార్పులు జరుగుతాయి. మరో ఆరోగ్యవంతమైన వ్యక్తిని దోమ కుట్టినప్పుడు లాలాజలంతోపాటు పారాసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులకు కారణమవుతుంది. ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడంవల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గూన్యా లాంటి జ్వరాలు, ఈడిస్, క్యూలెక్స్ దోమలు కుట్టడంవల్ల బోదకాళ్లు వస్తాయి.

నివారణ ఇలా..

దోమలు కుడితే ఎంతటి ప్రాణాంతక విషజ్వరాలు ప్రబలుతాయో అందరికీ తెలిసిందే. మలేరియా, డెంగీ వంటి జ్వరాలకు దోమలే కారణం. మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ వంటివి దోమల నివారణకు ఇంట్లో వాడుతాం. వాటివల్ల కొందరికి శ్వాసకోస వ్యాధులు వస్తాయి. ఈ నేపథ్యంలో దోమల నివారణకు సహజ పద్ధతిలో చర్యలు చేపట్టడమే ఉత్తమం. వేపనూనె దోమలను తరిమికొట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దీని వాసన దోమలు భరించలేవు. వేప, కొబ్బరి నూనెలను సమాన భాగాలుగా చేసుకుని బయటకు కనిపించే శరీర భాగాలపై రాసుకుంటే దోమలు దరిచేరవు. ఇళ్లలోకి దో మలు ప్రవేశించే కిటికీల వంటి ద్వారాలవద్ద తులసీమొక్కలను పెంచాలి. ఇవి దోమలను దూ రం చేస్తాయి. వృద్ధి కాకుండా చేస్తాయి. లెమన్, యూకలిప్టస్ ఆయిల్ మిశ్రమం దోమలను తరిమికొడుతుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ సెప్టిక్‌గానే కాకుండా ఇన్‌సెక్ట్ రిప్లెంట్‌గాను పనిచేస్తుంది. కర్పూరం మెరుగ్గా పనిచేస్తుంది. ఖాళీ ప్రదేశాలను మూసిన తర్వాత కర్పూరాన్ని వెలిగిస్తే దాని నుంచి వచ్చే పొగకు దోమల మాయమవుతాయి.



అప్రమత్తంగా ఉండాలి

దోమలనుంచి వచ్చే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మలేరియా,డెంగీ వంటి వ్యాధులు ప్రస్తుతం తగ్గుముఖం పడుతున్నాయి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. డెంగ్యూ, మలేరియాలపై ప్రజల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాం.

-ఎన్.వెంకటేశ్వరరావు,
జిల్లా మలేరియా అధికారి, ముమ్మిడివరం



దోమల వ్యాప్తిపై వివరిస్తున్న మలేరియా అధికారి



విద్యుత్ అధికంగా

వాడుతున్నారా?

- అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు అవకాశం
- 'వీడీఎస్ వలంటరీ డిస్‌క్లోజర్ స్కీమ్'ను తీసుకొచ్చిన విద్యుత్‌శాఖ
- స్వచ్ఛందంగా అదనపు లోడ్ వెల్లడించే పథకం
- ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు గడువు పొడిగింపు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 26,460 దరఖాస్తుల రాక

(ఆంధ్రజ్యోతి- కాకినాడ)

'విద్యుత్ వినియోగంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించి, అధిక లోడ్ వినియోగదారులపై కేసులు నమోదు చేస్తాం. ఫైన్‌లు వేస్తాం. గృహ వినియోగదారులు లోడు క్రమబద్ధీకరించుకుంటే హెచ్చుతగ్గులుండవు.' ప్రస్తుతం విద్యుత్‌శాఖ అధికారులు చేస్తున్న ప్రచారమిది. విద్యుత్ వినియోగదారుల అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు కాకినాడ సర్కిల్ పరిధిలో మొత్తం 6,998, తూర్పుగోదావరి జిల్లాలో 10,199, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో 9,263 దరఖాస్తులు వచ్చాయి. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 26,460 దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి గృహ విద్యుత్ వినియోగంలో విద్యుత్ వాడకానికి సంబంధించి అదనపు విద్యుత్ వాడుతున్న వినియోగదారులకు స్వచ్ఛంద అదనపు లోడ్ వెల్లడి పథకం (వీడీఎస్ వలంటరీ డిస్‌క్లోజర్ స్కీమ్)ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. వినియోగదారులు వారు వాడుతున్న విద్యుత్ వాడకాన్ని అనుసరించి అదనపు లోడ్ ఏర్పాటు చేసుకోవడానికి 50శాతం సబ్సిడీ కల్పిస్తోంది. విద్యుత్ వినియోగదారుల నుంచి ఈ మేరకు చార్జీలు వసూలు చేస్తోంది. ఈ విద్యుత్ రాయితీకి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ తేదీ జూన్ 30 అని తొలుత ప్రకటించినా.. ఆ గడువును డిసెంబర్ నెలాఖరు వరకు పొడిగించింది. సాధారణంగా ఒక కిలోవాట్‌కు దరఖాస్తు ఫీజు రూ.50, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఏపీఈపీడీసీఎల్ ప్రకటించిన వీడీఎస్ పథకంలో కిలోవాట్‌కు రూ.1250, రెండు కిలోవాట్లకు రూ.2450, మూడు కిలోవాట్లకు రూ.3,650 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఈ మేరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అంటే 50 శాతం రాయితీతో లోడు క్రమబద్ధీకరించుకునే అవకాశం ఇచ్చారు. కాకినాడ జిల్లాలో 6,68,126 మంది వినియోగదారులు ఉన్నారు. వాణిజ్య, వ్యాపార, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయ, ఆక్వా ఇతర అనుబంధ రంగాల కేటగిరీలో మరో లక్షా 25 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కాకినాడ సర్కిల్‌లో జగ్గంపేట డివిజన్ (జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని సబ్ డివిజన్లు) 1510 దరఖాస్తులు, కాకినాడ డివిజన్(కాకినాడ, కరప, సర్పవరం సబ్‌డివిజన్లు) 3212 దరఖాస్తులు, పెద్దాపురం డివిజన్ (పిఠాపురం, సామర్లకోట సబ్‌డివిజన్లు) 2276 ఇలా మొత్తం కాకినాడ సర్కిల్‌లో 6998 దరఖాస్తులు వచ్చాయి. 11558.99 కిలోవాట్ల అదనపు లోడు కోరుతూ ఇవి వచ్చాయి. డెవలప్‌మెంట్ చార్జీల కోసం రూ.107.41 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.24.21 లక్షలు, ఎస్ఎల్‌సీ రూ.2.31 లక్షలు వసూలైంది. వాస్తవానికి విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇలా అందరి ఇళ్లల్లోనూ కనిపిస్తున్నాయి. నిర్దేశించిన లోడు కన్నా ఎక్కువ వాడుతున్నారు. అదనపు లోడ్ భారం ట్రాన్స్‌ఫార్మర్లపై పడి తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇలాంటి సమస్యలు అధిగమించేందుకే ఈపీడీసీఎల్ గృహ విద్యుత్ వినియోగదారు లకు లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తోంది.

ఒక్కో జిల్లాకు కోటి

- వరద సహాయక చర్యలకు ఉమ్మడి జిల్లాకు రూ.3కోట్లు
- తక్షణ చర్యలకు వెచ్చించాలని ప్రభుత్వం ఆదేశాలు
- సురక్షిత ప్రాంతాలకు వరద బాధితులను తరలించాలని సూచన

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బాధిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా నిధులు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాకు రూ.కోటి చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.3కోట్లు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో వర్షాలు, వరద ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, వైద్య సేవలు అందించాలని కలెక్టర్లను ఆదేశించింది. ఆర్టీసీ బస్సులను తరలించి వరద ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించింది. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ సంస్థ అధికారులు వర్షాలు, వరద ముప్పు ప్రాంతాల జిల్లాల కలెక్టర్లతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు. అటు గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కోనసీమ జిల్లాలో నాలుగు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండండి

- ఐజీ, ఈగల్ చీఫ్ రవికృష్ణ
- నన్నయ యూనివర్శిటీలో యాంటీ ర్యాగింగ్ వారోత్సవం, ఈగల్ డ్రగ్స్ చైతన్య కార్యక్రమం



ఈగల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐజీ రవికృష్ణ, వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవం, ఈగల్ డ్రగ్స్ చైతన్య కార్యక్రమం మంగళవారం జరిగింది. దీనికి ఐజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తాను రాజమహేంద్రవరంలో పుట్టి పెరిగి, ఇక్కడే విద్యాభ్యాసం పూర్తిచేశానని, నన్నయ యూనివర్శిటీకి రావడం ఆనందంగా ఉందన్నారు. నేటి సాంకేతిక యుగంలో భయం, దురాశ, వ్యామోహం, అవమానం వంటివి సైబర్‌నేరాల పెరుగుదలకు కారణాలు అవుతున్నాయని చెప్పారు. దీని పట్ల యువత అవగాహన కలిగి ఉండి సమాజానికి, పెద్దలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాలపై సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబరు 1930కు తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో నేరాలకు అడ్డాగా ఉన్న ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని పదేళ్ల నుంచి నేరాలు లేకుండా అరికట్టి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత విషయం కాదని, కుటుంబాల భవిష్యత్తును క్షీణింపజేసే సామాజిక అంటువ్యాధి అని అన్నారు. యువత మనస్సులు నూతన ఆవిష్కరణలు, నాయకత్వం, ప్రేరణ కోసం ఉద్దేశించబడాలన్నారు. ఈగల్ ఎస్పీ కె.నగేష్‌బాబు మాట్లాడుతూ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను ఐజీ నివృత్తి చేశారు. డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటామని, వాటి జోలికి పోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ రూపొందించిన డ్రగ్స్, సైబర్‌నేరాల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ కేవీ స్వామి, సౌతోజోన్ డీఎస్పీ భవ్యశ్రీ, ఈగల్ డీఎస్పీ పి.సూర్యమోహనరావు, నన్నయ డీన్ ఆచార్య ఎస్.ఉదయభాస్కర్, న్యాయాధికారి నాగేంద్ర పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్ల నిధులు

- మాల వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ యువతకు నైపుణ్యాల శిక్షణ,ఉపాధి కల్పనలకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్ల నిధులు కేటాయించిందని రాష్ట్ర మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ తెలిపారు. మంగళవారం కాకినాడ జిల్లాలో పర్యటించిన ఆయన ఉదయం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతోను, ఎస్సీ మాల సంక్షేమ, యువజన సంఘాలతో సమావేశమై కార్పొరేషన్ ద్వారా చేపట్టవలసిన కార్యాచరణపై చర్చించి, సూచనలు, సలహాలు స్వీకరించారు. మధ్యాహ్నం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో ఈ సంవత్సరం 26,200 మందికి ఉపాధి రుణాలు కల్పించే ప్రణాళిక అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ యువతకు నైపుణ్యాల శిక్షణ, అభివృద్ధి లక్ష్యంగా నాక్ సంస్థ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎస్సీ యువతలో ఆర్థిక అక్షరాస్యతను, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను పెంపొందించి 2047 నాటికి ఎస్సీ కుటుంబాల్లో ప్రతీ ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్త,పారిశ్రామికవేత్త ఉండేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ఆర్థిక సహాయ కార్యక్రమాలను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు.జిల్లాలో వనరుల ఆధారంగా ఎస్సీ మాలల ఆర్థిక ప్రగతికి లోకలైజ్డ్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామని చైర్మన్ విజయ్‌కుమార్ చెప్పారు. సమావేశంలో మాల వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు దానం లాజర్ బాబు, కొల్లాబత్తుల అప్పారావు, చెల్లు అశోక్, మద్దా మణి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.సత్యవతి, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు



సామర్లకోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కలెక్టర్ షాన్‌మోహన్ తదితరులు

పెద్దాపురం/సామర్లకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 23న పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ షాన్ మోహన్, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పట్టణంలోని మానోజ్ చెరువు, ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉందన్నారు.అలాగే సామర్లకోట పట్టణ శివారులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగే సీఎం ప్రజా వేదిక సభ ఏర్పాట్లను కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే చిన రాజప్ప, అధికారులు పరిశీలించారు. అదే ఆవరణలో టీడీపీ కార్యకర్తల సమావేశం కూడా జరుగుతుందని సమాచారం. కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ కార్పొరేషన్ కమిషనరు భావన, డీఆర్వో వెంకటరావు, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఏఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, పీసీబీ కార్యనిర్వాహక ఇంజనీర్ శంకరరావు, డీపీవో వి.రవికుమార్, సీపీవో త్రినాథ్, ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున, తహశీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, సామర్లకోట కమిషనరు శ్రీవిద్య పాల్గొన్నారు.

తగ్గుతూ..పెరుగుతూ..

- ఎగువున పెరుగుతున్న గోదావరి ప్రవాహం
- ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం



ధవళేశ్వరం బ్యారేజీ దిగువున ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి తగ్గుతూ పెరుగుతూ ప్రవహిస్తోంది. ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి పరివాహకం నుంచి వరద గోదావరికి చేరుతుండడంతో ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతుండగా ధవళేశ్వరం వద్ద తగ్గుతూ ప్రవహిసోంది. కాటన్ బ్యారేజ్ నుంచి మంగళవారం ఉదయం 6గంటలకు అత్యధికంగా 8,23,083క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండగా నీటి మట్టం 10.40అడుగులకు చేరుకుంది. ఆపై మధ్యాహ్నం 11గంటల వరకు అదే రీడింగ్ వద్ద నిలకడగా కొనసాగిన నీటి మట్టం తరువాత తగ్గుముఖం పడుతూ సాయంత్రానికి 9.90 అడుగులకు చేరుకోగా కాటన్ బ్యారేజ్ ద్వారా7,40,578 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. బుధవారం ఉదయానికి 10 లక్షలకు చేరుకోవచ్చని అధికారుల అంచనా. ఎగువున భద్రాచలం వద్ద సోమవారం రాత్రి 8గంటల వరకు పెరిగిన నీటి మట్టం 38.30 అడుగులకు చేరుకుంది. ఆపై క్రమంగా తగ్గుతూ మంగళవారం సాయంత్రానికి 36.30 అడుగులకు చేరుకుంది.

దిగ్బంధనంలో గ్రామాలు

చింతూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వీడని ముసురు, ఎటు చూసినా వరద నీరే.. రోజంతా చలిగాలులు. దిగ్బంధనంలో గ్రామాలు, దీంతో లోతట్టు వాసులు ఇక్కట్లు పడుతున్నారు. సోమవారం రాత్రి చింతూరు వద్ద 33 అడుగులకు చేరుకున్న శబరి ఉధృతి మంగళవారం ఉదయం కాస్త తగ్గి 31 అడుగులకు చేరింది. తిరిగి మంగళవారం సాయంత్రానికి 33 అడుగులు దాటి ప్రవహిస్తోంది. అదే సమయంలో భద్రాచలం వద్ద 36.80 అడుగుల మేర ప్రవహిస్తోంది.దీంతో లోతట్టు వాసుల్లో ఆందోళన అలుముకుంది. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి 3.50లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయ డంతో గోదావరి ఉధృతి పెరిగింది. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవచ్చని అధి కారులు అంచనా వేస్తున్నారు. దీంతో శబరి ఉధృతి కూడా మరింత పెరగొచ్చని అంటున్నారు. శబరి ఉధృతితో ఛత్తీస్‌గడ్ ఒడిస్సాల నడుమ సుక్మా సమీపంలో నదిపై నిర్మించిన వంతెన నీట మునిగింది. అదే దశలో ఆంధ్రా-ఒడిస్సా 30వ జాతీయ రహదారి నిమ్మలగూడెం వద్ద నీట మునిగింది.చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారిపై చీకటి వాగు, సోకిలేరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చింతూరు-కూనవరం ప్రధాన రహదారిపై కొండ్రాజపేట వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ముసురు పట్టి రోజంతా వర్షం కురియడంతో చలి గాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. మంగళవారం కూడా చింతూరు మండలంలో 16 గ్రామాలు దిగ్బంధనంలోనే ఉన్నాయి. ఇదిలా వుండగా చింతూరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ప్రతి బుధవారం జరిగే గ్రీవెన్సును వరదలు, వర్షాల కారణంగా రద్దు చేస్తున్నట్టు పీవో అపూర్వ భరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర రహదార్లపై వరద నీరు చేరడంతో చింతూరు మండలం చట్టి వద్ద 30వ నెంబరు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించే వాహనాలన్నీ నిలిచిపోయి బారులుదీరాయి.



ఛత్తీస్‌గడ్-ఒడిస్సా రోడ్డులో సుక్మా వద్ద నీట మునిగిన వంతెన



చింతూరు: చట్టి వద్ద నిలిచిపోయిన వాహనాలు



చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారిపై వరద నీరు

కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఖాళీలను భర్తీ చేయాలి

కేంద్ర కార్మిక శాఖ మంత్రిని కోరిన ఎంపీ సతీష్‌బాబు



మంత్రి మాండవియాతో సతీష్‌బాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉన్నందున ఖాళీలను భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మంగళవారం ఢిల్లీలో కేంద్ర కార్మిక, ఉపాధి యువజన, క్రీడా వ్యవహారాల శాఖల మంత్రి మాన్సుఖ్ మాండవియాను కలిసి కోరారు. 500 పడకల సామర్థ్యం ఉన్న కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రికి మొత్తం 205 పోస్టులు మంజూరుకాగా 88 కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో స్పెషలిస్టులు, సీనియర్ రెసిడెంట్స్, నర్సింగ్ ఆఫీసర్లు, టెక్నీషియన్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. సిబ్బంది కొరత వల్ల రోగులకు సమయానికి వైద్యం అందించడంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఖాళీలను తక్షణమే భర్తీ చేసి ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందించేలా చూడాలని మంత్రిని కోరారు.

ఖేలో ఇండియా ప్రాజెక్టులను పూర్తి చేయాలి.. అలాగే రాష్ట్రంలో జాతీయ క్రీడా ప్రావీణ్య కేంద్రాల ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న ఖేలో ఇండియా ప్రాజెక్టుల పూర్తి, ప్రతి జిల్లాలో అదనపు ఖేలో ఇండియా సెంటర్లు, రాయలసీమలో కొత్త ఎస్ఏఐ ట్రైనింగ్ సెంటర్ స్థాపన వంటి ప్రతిపాదనలను సమర్పించారు. ఈ మేరకు ఎంపీ సతీష్‌బాబు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వేదశాస్త్ర పండిత సన్మాన సభ

సామర్లకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో మంగళవారం బాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్ 27వ వేదశాస్త్ర పండిత సన్మాన సభ జరిగింది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఘనాపాఠీలు వచ్చి వేదాలు పఠించారు. పరిషత్ కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ ఈవో బళ్ల నీలకంఠం నేతృత్వంలో నిర్వహించిన సభకు హాజరైన పండితులు చతుర్వేద పారాయణ, వేదస్వస్తి నిర్వహించారు. అనంతరం పండిత సత్కారం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, జ్యోతిషుడు చీమలకొండ ప్రసాద్, భీమే శ్వర అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి చుండ్రు గోపా లకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సింగవరపు సత్యనారాయణ, గుండు శంకరరావు, కాపుగంటి పైడిరత్నం, బుర్రే కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కన్నేసి.. స్థలం కబ్జా చేసి!

రాజమహేంద్రవరంలో ఐదుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): స్థలం కాజేసిన ఐదుగురిని రాజమహేంద్రవరం పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య మంగళవారం వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గొల్లపల్లి కాశీ విశాలాక్షి వైద్యురాలిగా పనిచేస్తుండేవారు. 1997లో తన కుమారులు గొల్లపల్లి వినోద్, గొల్లపల్లి లక్ష్మణ్ పేరున కవలగొయ్యి గ్రామ పరిధిలోని ఎస్ఆర్ నెం.496లో ప్లాటు నెం.39 ద్వారా 267చదరపు గజాలు.. దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలో ప్లాట్ నెం.204లో వినోద్ పేరున 267చ.గ., లక్ష్మణ్ పేరున ప్లాట్ నెం.203లో 267 చదరపు గజాల స్థలాన్ని కొన్నారు. ఆమె భర్త 2012లో మరణించడంతో తన స్వగ్రామం ఆకివీడు మండలం కుప్పనపూడి వెళ్లిపోయారు. తర్వాత కుమారులు ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. విశాలాక్షి కూడా అమెరికా వెళ్లారు. ఇటీవల స్వగ్రామం వచ్చి స్థలాలను ఒకసారి పరిశీలించుకుందామని రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అవి వేరొక వ్యక్తులకు క్రయంగా దాఖలు పడ్డాయని తెలియడంతో అవాక్కయ్యారు. దొంగ రిజిస్ట్రేషన్లు జరిగాయని గ్రహించి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో సీఐ కాశీ విశ్వనాథ్ టీం దర్యాప్తు ప్రారంభించింది. దీంతో పలు విషయాలు వెలుగు చూశాయి. రియల్ ఎస్టేటు బ్రోకర్లుగా ఉన్న మద్దిరెడ్డి లక్ష్మీ నారాయణ, మద్దిరెడ్డి నాగేంద్ర ప్రసాద్(సిటీ బస్సు ప్రసాద్)కి 2013 జనవరిలో షేక్ ఫకీర్ మహమ్మద్ ఖాసిం బాషా అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఏళ్లైనా ఎక్కువ కాలం ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి తన దృష్టికి తెస్తే నకిలీ దస్తావేజులు తయారు చేసి అమ్ముకోవచ్చని, అధిక మొత్తంలో సొమ్ము వస్తుందని చెప్పాడు. వాళ్లు తమకు తెలిసిన రియల్ ఎస్టేటు వ్యాపారుల నుంచి విశాలాక్షి కుమారులకు సంబంధించిన ప్లాట్ల దస్తావేజు జిరాక్సులను తీసుకెళ్లి ఖాసింకి ఇచ్చారు. అతడు నకిలీ జిరాక్సు కాపీలతో ఒరిజినల్ దస్తావేజులను తయారు చేయించాడు. రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రేషను సమయంలో ధవళేశ్వరానికి చెందిన పాతూరి ప్రసాద్, సబ్బితి భాస్కరరావుకు రూ.20వేల చొప్పున ఇచ్చి వినోద్, లక్ష్మణ్‌గా నటింపజేసి రిజిస్ట్రేషను ప్రక్రియ పూర్తి చేశారు. రిజిస్ట్రారు కార్యాలయంలో ఏ విధంగా నడుచుకోవాలనే విషయంపై కొవ్వూరుకు చెందిన యాదగిరి సురేష్, గాలి రాజేంద్ర ప్రసాద్‌తో తర్ఫీదు ఇప్పించారు. నకిలీ ఓటర్ ఐడీ కార్డులు, దస్తా వేజులతో మరికొందరితో కలిసి నకిలీ రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆపై వేరొకరికి విక్రయించేశారు. ఈ కేసులో షేక్ ఫకీర్ మహమ్మద్ ఖాసీం బాషా, మద్దిరెడ్డి లక్ష్మీ నారాయణ, మద్దిరెడ్డి నాగేంద్రప్రసాద్, సబ్బితి భాస్కరరావు, యాదగిరి సురేశ్‌ని అరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని డీఎస్పీ వివరించారు. ఖాళీ స్థలం కనబడితే కర్చీఫ్ వేసి కాజేస్తామంటే ఉపేక్షించేది లేదని, కబ్జా వ్యవహారాలపై పటిష్ఠ నిఘా పెట్టామని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. ఎక్కువ కాలం తమ స్థలాలను పట్టించుకోకుండా ఉండడం సరికాదని, పరిశీలించుకుంటూ ఉండాలని పేర్కొన్నారు. అయితే రిజిస్ట్రేషను ఎలా జరిగిందనే అంశంపై విమర్శలు, అప్పటి సబ్-రిజిస్ట్రారుపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు వినవస్తున్నాయి.

1 నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు



శ్రీలక్ష్మీనరసింహస్వామి

అంతర్వేది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రంలో సెప్టెంబరు 1 నుంచి 4 తేదీ వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. 1వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అంకురార్పణ, ఆదివాసవులు.. 2,3 తేదీల్లో అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమాలు, పవిత్రారోహణ, 4వ తేదీ గురువారం ఉదయం మహాశాంతి హోమం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, రాత్రి పవిత్రఅవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పం, పవిత్రముల వినియోగం జరుగుతుందని ఏసీ తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ భాద్రపద శుద్ధ నవమి నుంచి ద్వాదశి వరకు స్వామివారి పవిత్రోత్సవాలు దేశ, రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, స్వామివారి దివ్యతేజో ప్రకాశములు కలగాలని, సర్వప్రాయశ్చిత్తార్థం పవిత్రోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని కోరారు.

శ్రీసిద్ధివినాయకుడి హుండీల ఆదాయం రూ.44.11 లక్షలు



సిద్ధివినాయకుడి ఆలయంలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుడి హుండీలను మంగళవారం లెక్కించారు. 90 రోజులకు ఆలయ ప్రధాన హుండీ నుంచి రూ.42,81,1787, అన్న ప్రసాద హుండీ నుంచి రూ.1,30,115 వెరసి మొత్తం రూ.44,11,902 నగదు, 173 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ నోట్లు 33 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ పేర్కొన్నారు. తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు, ట్రైనింగ్ సహాయ కమిషనర్ ఎం.మంజులాదేవి, జిల్లా దేవాదాయశాఖాధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. అర్చకులు, గ్రామస్తులు, ఆలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీపై సెన్సూర్ జరిమానా

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కొవ్వూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ టీ.శ్రీనివాసులపై సెన్సూర్ జరిమానా విధించినట్టు ఎక్స్ అఫిషియో స్పెషల్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కొవ్వూరు ఏఎంసీలో సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా పనిచేసిన టి.శ్రీనివాసులు ప్రస్తుతం కాకినాడ జిల్లా కరప ఏఎంసీలో సెక్రటరీగా పనిచేస్తున్నారు. రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఉన్న 2ఎగ్జిక్యూటివ్ పిటీషన్ కేసుల్లో ఉత్తర్వులు ఉన్నా ప్రతి వాది జీతం అటాచ్‌మెంటు చేయడంలో విఫలమైనందుకు సెక్రటరీ శ్రీనివాసులుపైనా అభియోగం మోపారు. భవిష్యత్‌లో ఇటువంటి తప్పులు పునరావృత్తం కాదని సెక్రటరీ హామీ ఇవ్వడంతో పాటు ఆర్టికల్ ఆఫ్ చార్జి నుంచి విముక్తి చేయాలని కోరారు. మొత్తం విషయాలను పరిశీలించిన అనంతరం ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనలు నియమం 9 ప్రకారం శ్రీనివాసులపై సెన్సూర్ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

దమ్ము ట్రాక్టర్ తిరగబడి ఇరుక్కున్న డ్రైవర్

గాయాలు.. ఆసుపత్రికి తరలింపు



ఇంజన్ భాగంలో ఇరుక్కున్న డ్రైవర్ విష్ణు

ఎటపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు దమ్ము ట్రాక్టర్ తిరగబడి స్టీరింగ్ భాగంలో డ్రైవర్ ఇరుక్కున్న ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గన్నవరం గ్రామానికి మోరంపల్లి విష్ణు గౌరిదేవి పేటలోని ఓ రైతు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వరినాట్లు సిద్ధం చేసేందుకు పొలాలను దమ్ము చేస్తున్నాడు. పొలంలో అక్కడక్కడ గోతులు ఉండడంతో దమ్ము ట్రాక్టర్ ఒక్కసారిగా తిగబడిపోయింది. డ్రైవర్ విష్ణు ట్రాక్టర్‌ను బయటికు తెచ్చేందుకు ప్రయత్నించే క్రమంలో ఇంజన్‌భాగం, స్టీరింగ్ మధ్య ఇరుక్కుపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి విష్ణును బయటకుతీశారు. గాయాలతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తర్వాత మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఓ ప్రయివేట ఆసుపత్రికి తరలించారు.

పెళ్లింట్లో అగ్నిప్రమాదం

వంట, వివాహ సామగ్రి పూర్తిగా దగ్ధం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ

కపిలేశ్వరపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామశివారు సత్యనారాయణపురం (అగ్రహారం)లో మంగళవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో వాటాల సూర్యనారాయణ తాటాకిల్లు దగ్ధమైంది. సూర్యనారాయణ కుమారుడు పోసయ్య పెద్ద కుమార్తెకు గురువారం వివాహం కావాల్సి ఉండగా సోమవారం ఆమెను పెళ్లి కుమార్తెను చేశారు. దీంతో బంధువులతో ఇల్లు సందడిగా ఉన్న సమయంలో గ్యాస్‌పై వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. వంట, వివాహ సామగ్రి పూర్తిగా కాలిబూడిదైనట్టు రోజువారీ కూలీలైన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండపేట ఫైర్ ఆఫీసర్ ఎం.వెంకట్రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ అర్జమ్మ, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించి బాధితుల వివరాలను నమోదు చేశారు. బాధిత కుటుంబానికి తక్షణసాయంగా 25 కిలోల బియ్యం అందజేసినట్టు తహశీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మండపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ, కుటుంబంలో కలహాలతో కలత చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో మంగళవారం జరిగింది. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం... ద్వారపూడి శ్మశాన వాటికలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడు మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన మల్లేశ్వరపు వెంకటేశ్వరరావు(35)గా గుర్తించారు. అతడికి భార్యతో గొడవల కారణంగా ఆమె పిల్లలతో ఏడిదలోనే వేరుగా ఉంటుంది. వెంకటేశ్వరరావుకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. ద్వారపూడిలో శ్మశానవాటిక వెనక చెట్టుకు ఉరివేసుకోవడంతో కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. మృతుడి ప్యాంట్ జేబులో లభ్యమైన పుస్తకంలో తన మరణానికి తానే కారణమని, మరెవరు కాదని రాసి ఉందని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మండపేట రూరల్ ఎస్ఐ కిషోర్ కేసు నమోదు చేశారు.

బురద రోడ్డులో వరి నాట్లు వేసి నిరసన



రహదారిపై నాట్లు వేస్తున్న మహిళలు

ఎటపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏటా వర్షాకాలంలో బురద రహదారిలో పడుతున్న అవస్థలపై ఆదివాసీలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీలోని చింతల చెరువు గ్రామంలోని అంతర్గత రహదారి నడవడానికి వీల్లేకుండా బురదమయంగా తయారవడంతో మహిళలు వరి నాట్లు వేశారు. ఎన్నో ఏళ్ల నుంచి రహదారిని అభివృద్ధిపై అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతోందని పేర్కొన్నారు.

'ఏలేరు'లో పెరుగుతోన్న నీటి నిల్వలు



ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరులో జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. మెస్తారు వర్షాలు, గోదావరి జలాలు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు పెరుగుతోంది. ప్రాజెక్టులో నీటి నిల్వలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 525 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్న డూలేనిరీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 79.25 మీటర్ల స్థాయిలో 12.59 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 200 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నారు.

జూజిట్సు క్రీడ జాతీయ రిఫరీగా అంజి



అంజికి నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు యాసిన్

అమలాపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన జూజిట్సు క్రీడకు జాతీయ రిఫరీగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన పడాల అంజి నియమితులయ్యారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఒక భాగమైన జూజిట్సు క్రీడను ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక క్రీడగా ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఉర్దూ మాస్కున్ హాలులో నాలుగు రోజులు తెలంగాణ జూజిట్సు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోటీలు, అవగాహన తరగతులు నిర్వహించారు. అంజి కార్యక్రమంలో పాల్గొని నేషనల్ రిఫరీగా ఉత్తీర్ణులయ్యారు. అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి జూజిట్సు చాంపియన్ షిప్ పోటీలకు రిఫరీగా అంజి హాజరుకానున్నారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాసిన్, ప్రధాన కార్యదర్శి ఎన్.గురు ప్రభాకరరావు చేతులమీదుగా అందుకున్నారు.

రూ.150కే మేలు జాతి పాడి పశువుల వీర్యం

ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సమస్త కార్యనిర్వాహణాధికారి

శంఖవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రూ.150కే మేలు జాతి పాడి పశువుల వీర్యాన్ని అందజేస్తున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పశుగణాభివృద్ధి సమస్త కార్యనిర్వాహణ అధికారి కే.కాంతారావు తెలిపారు. పాడి పశువులకు కృత్రిమ గర్భధారణతో రైతులు ఆర్థికంగా లాభం పొందవచ్చిని చెప్పారు. మంగళవారం కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో పశు వైద్యశాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో పశుసంవర్ధకశాఖ కీలక పాత్ర పోషిస్తుందని, పాడిపశువుల పెంపకంలో మేలు జాతి పశువులే అధిక పాలు ఇస్తాయన్నారు. రైతులు ఆర్థికంగా బలోపేతం కావడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పాడి పశువులకు నాణ్యమైన మేలు జాతి పాడి పశువుల వీర్యాన్ని త క్కువ ధరలో అందజేస్తున్నట్టు తెలిపారు. గతంలో రూ.500 ధర ఉండగా ప్రస్తుతం రూ.150 కే అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రైతు పశుపోషణలో ఆధునిక పద్ధతులు పాటించాలని కోరారు.



కాకినాడ జిల్లా శంఖవరంలో మాట్లాడుతున్న కాంతారావు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో గాయని కౌసల్య

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య

తునిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య అన్నారు. కాకినాడ జిల్లా తునిలో శ్రీప్రకాష్ విద్యాసంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా 2 రోజుల పాటు విద్యాసంస్థల శాఖలైన తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం విద్యార్థులకు గాతా రహే మేరా దిల్ పేరిట పాట పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా గాయని కౌసల్య, కీబోర్డు ప్లేయర్ రవి శేఖర్ వ్యవహరించారు. కౌసల్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే ఇలాంటి కార్యక్రమాలు పాఠశాల యాజమాన్యం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అనంతరం తన పాటలతో అలరించారు. విజేతలు, అతిథులకు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ బహుమతులు అందజేశారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, వివిఎస్ఎస్ భాను మూర్తి, డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాజీ మంత్రి కన్నబాబుకు పితృ వియోగం



సత్యనారాయణ (ఫైల్)

సర్పవరం జంక్షన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు పితృ వియోగానికి గురయ్యారు. గత కొంతకాలంగా అనారోగ్య రుగ్మతలతో ఆయన తండ్రి సత్యనారాయణ (76) బాధపడుతున్నారు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భౌతికకాయాన్ని వైద్యనగర్‌లో గల కన్నబాబు నివాసం వద్దకు తీసుకువచ్చారు. ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, గుడివాడ అమర్‌నాథ్, జోగి రమేష్, సీహెచ్.వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీలు వంగా గీత, చింతా అనురాధా, తోట నరసింహం, ఎం భరత్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జగ్గిరెడ్డి, జక్కంపూడి రాజా, టీడీపీ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి దంపతులు సత్యనారాయణ పార్థీవదేహానికి నివాళులర్పించారు. అనంతరం భౌతికకాయాన్ని భారీ ఊరేగింపుగా కాకినాడ ఆర్టీసీ సమీపంలో శ్మశానవాటికకు తీసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సంతాపం వ్యక్తం చేశారు.

కోడలితో గొడవ... ఇంటి నుంచి వెళ్లిపోయిన అత్త

కరప, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అత్తాకోడళ్ల మధ్య వివాదంతో మనస్తాపం చెందిన అత్త ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టకు చెందిన నురుకుర్తి సత్యనారాయణమ్మ, ఆమె కోడలు హిమబిందు మధ్య ఈ నెల 18న మధ్యాహ్నం ఏదో విషయంలో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరగడంతో కుటుంబ సభ్యులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో మనస్తాపం చెందిన సత్యనారాయణమ్మ ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడు శివశంకర్ మంగళవారం కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వీధికుక్కల దాడిలో 11 మేక పిల్లలు మృతి



మృతిచెందిన మేక పిల్లలు

ఎటపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో 11 మేక పిల్లలు మృతి చెందిన ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురంలో జరిగింది. గ్రామానికి చెందిన బుద్దుల భద్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి కూలీ పనులకు వెళ్లారు. మేకల దొడ్డిలోని మేక పిల్లలపై వీధి కుక్కలు దాడి చేయడంతో 11మేక పిల్లలు మృతి చెందాయి. మేక పిల్లల విలువ రూ.1 లక్ష వరకు ఉంటుందని బాధితుడు భద్రయ్య తెలిపాడు.

బాలుడికి తీవ్ర గాయాలు

జగ్గంపేట రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గొల్లలగుంట గ్రామానికి చెందిన 4ఏళ్ళ మహిమాన్విత్‌పై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఇంటి బయట ఆడుకుంటున్న మహిమాన్విత్‌ను వీధి కుక్కలు మెడ, తల భాగంపై తీవ్రంగా కరిచాయి. బాలుడి అరుపుతో తల్లిదండ్రులు కుక్కలను తరిమి బాలుడిని రక్షించుకున్నారు. తండ్రి రత్నరాజు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కపిలేశ్వరపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో చిన్నవంతెన సమీపంలో ప్రధాన పంటకాలువలో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సుమారు 55 ఏళ్లు ఉండే వ్యక్తి మృతదేహాన్ని పైకి తీసి శవపంచనామా అనంతరం మండపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు అంగర ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు. వీఆర్వో సాకా సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఎవరైనా మిస్సింగ్ అయితే తమను సంప్రదించాలని కోరారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్

రౌతులపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన గండేపల్లి దుర్గాప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... గంజాయి కేసులో పరారీలో ఉన్న దుర్గాప్రసాద్‌ను రౌతులపూడి గ్రామశివారు మరిడమ్మ ఆలయం దగ్గర మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు ఉన్నారు.

మబ్బులు.. అందాలు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో మంగళవారం ఆకాశం మేఘావృతమై కారు మబ్బులు కమ్ముకుని ప్రకృతి అందాలు కనువిందు చేశాయి – ప్రత్తిపాడు ఆంధ్రజ్యోతి



రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

పౌరుల సాధికారతపై అవగాహన సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

కడియం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో మంగళవారం పౌరుల సాధికారతపై మౌలిక స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి విచ్చేసి ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నియంత్రణ, బాల్య వివాహాల నిర్మూలన,పీసీఆర్ చట్టం, ఎస్సీ, ఎస్టీ పీవోఏ చట్టంపై అవగాహన కలిగించారు. ఇన్‌చార్జి తహశీల్దారు ఎం.సునీల్‌కుమార్ కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, రేషన్‌కార్డు, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్, బీపీఎల్ సర్టిఫికెట్ వంటి రెవెన్యూ సేవలపై ప్రజలకు సందేహాలు నివృత్తి చేశారు. ఎంపీడీవో కె.రమేష్ ప్రభుత్వ సేవల విధానంపైన, ఎస్ఐ లక్ష్మీప్రసన్న మహిళా భద్రత, సైబర్ నేరాల నివారణపైన అవగాహన కలిగించారు.కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, న్యాయవాదులు, ఏపీవో, వెలుగు ఏపీఎం, కార్యదర్శులు పాల్గొన్నారు.

'సంచార జాతుల సభకు తరలిరండి'

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 30వ తేదీన విజయవాడలో నిర్వహించతలపెట్టిన స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని పలువురు బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం ఆధ్వర్యంలో రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, మండల అధ్యక్షుడు నాగల శివ, బీజేపీ నాయకులు రాజమహేంద్రవరం శివారు కొంతమూరులో నివాసముంటున్న సంచారజాతులకు చెందిన బేడ బుడగ జంగం, లంబాడీ కులాల సంఘ పెద్దలను కలసి సభకు ఆహ్వానించారు. బీజేపీ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ పడాల హథీరాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ పీజీ కోటా తగ్గింపుతో అన్యాయం

కలెక్టర్, డీఎంహెచ్‌వోకు ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్ అసోసియేషన్ వినతి


డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెం.99 ద్వారా ఇన్‌సర్వీస్ పీజీ కోటా తగ్గించడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొంటూ మంగళవారం జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్‌కు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారికి వినతిపత్రాలు అందజేశారు. తక్షణమే జీవో 99 రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లకు మంచి కెరీర్ అవకాశాలు ఉంటాయని, వారికి పీజీ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి తమతో ఎలాంటి చర్చ లేకుండా జీవో 99 విడుదల చేయడం తమను వంచించడమేనని డాక్టర్లు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోయినా తాము పెరుగుతున్న పనిభారం, కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల ఆరోగ్యానికి కృషి చేస్తున్నామని, అయినా ప్రభుత్వం తమ పట్ల వివక్ష చూపడం సరికాదని వారు వివరించారు. పీజీలో ఇన్ సర్వీస్ కోటా యథాతథ స్థితి కొనసాగిస్తూనే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న డీపీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యు డాక్టర్లకు ట్రైబల్ ఎలవెన్స్ మంజూరు చేయడం, డీపీహెచ్ఎఫ్‌డబ్ల్యు సీఏఎస్ డాక్టర్లకు టైం బౌండ్ ప్రమోషన్లు, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, తమతో చర్చలు జరపాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ షమ్మి కుమార్, డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థికి కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న కోడి కిషోర్

రంగంపేట, ఆగస్టు 19(ఆంధ్రజోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ ఇండియన్ యాక్ట్ ఎవర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ ఉత్తరాంధ్ర రీజినల్ చైర్మన్ కోడి కిషోర్ సూచించారు. సంస్థ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని చంద్రేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిషోర్ మాట్లాడారు. వినియోగదారుల రక్షణ, అవినీతి నిరోధక, పంచాయతీరాజ్, సమాచార హక్కు, తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ తదితర చట్టాలపై అవగాహన పెంచుకొని వాటి వినియోగంలో చైతన్యవంతులు కావాలన్నారు. అనంతరం సమాచార చట్టంపై ముద్రించిన కరపత్రాన్ని విడుదల చేసి, విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరబాబు, సీఆర్ఎంటీఎల్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


ఎస్‌కేవీటీలో మొక్కలు నాటుతున్న మానవత సంస్థ సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం అవసరమని, ఈ విషయంలో ప్రతీఒక్కరూ బాధ్యత వహించాలని పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీ ఆవరణలో మానవత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై మానవుడు జీవించాలంటే ప్రకృతి సహకరించాలని, కానీ, ఓజోన్ పొర దెబ్బతింటోందని తద్వారానే మనందరం ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకం పర్యావరణాన్ని దెబ్బతిస్తోందన్నారు. రాబోయే తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ ఒక్కరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య మాట్లాడుతూ తమ కళాశాలలో సుమారు 120 మొక్కలు ఉన్నాయని, మానవత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం 20 రకాల 90 మొక్కలు నాటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బోరుగడ్డ మురళి, అధ్యక్షులు కేవీఎస్ నారాయణ, జంగారెడ్డిగూడేనికి చెందిన మొక్కల దాత దల్లి రామాంజనేయ రెడ్డి, లెక్చరర్ పీవీవీ సంజీవరావు, కండేపు సునీత, గంగాధర్, సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి జీజీయూలో జాతీయ సెమినార్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఆటోమోటివ్‌లో ప్రత్యామ్నాయ ఇంధనంగా హైడ్రోజన్ ప్రాముఖ్యతపై అటల్ వాటి జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్టు ఛాన్సలర్ చైతన్యరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ప్రోచాన్సలర్ కె.శశి కిరణ్ వర్మ, వీసీ యు.చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ సెమినార్ పూర్తిగా తెలుగులోనే కొనసాగుతుందని, తెలుగు రాష్ట్రాల్లోని వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రఖ్యాత పరిశ్రమల నుంచి ప్రముఖులు రిసోర్స్‌పర్సన్లుగా విచ్చేస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్ టి.జయా నందకుమార్, ఎంవీఎస్ బాబు పాల్గొన్నారు.

తొలగించిన దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలనకు అర్జీలు చేసుకోండి

రాజానగరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో ఇటీవల తొలగించబడిన దివ్యాంగ పింఛనుదారుల్లో అర్హత కలిగిన వారెవరైనా ఉంటే పునఃపరిశీలించి, పునరుద్ధరించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో జేఏ ఝాన్సీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో అనర్హులైన 321 మందికి దివ్యాంగ పింఛన్లను ఇటీవల రద్దు చేశారని, వాటిని పునఃపరిశీలిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి అప్పీలు కోరుతూ అర్జీ, ఆధార్‌కార్డు, పింఛను రద్దు నోటీసు, సదరం సర్టిఫికెట్(పాతది), సదరం సర్టిఫికెట్(కొత్తది), రేషన్ కార్డు, ఏదైనా ఆసుపత్రిలో చికిత్స పొందినట్లైతే సంబంధిత రికార్డుతో అర్హులైన పింఛనుదారులు సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్ సిఫార్సుతో ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరుతడి పంటలతో నాణ్యమైన దిగుబడులు

కొవ్వూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆరుతడి పంటలతో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు అన్నారు. కొవ్వూరు మండలం పంగిడిలో మంగళవారం రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ఆరుతడి పంటలలో నీటిని తక్కువగా అందించడంతో పంటలకు ఎటు వంటి తెగుళ్లు సోకవన్నారు.

మొబైల్స్‌తో ఫొటోగ్రాఫర్ల ఉపాధికి ముప్పు

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


బలభద్రపురంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న వీడియో అండ్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్

బిక్కవోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మొబైల్స్‌తో ఫొటోగ్రాఫర్స్ జీవనోపాధికి ముప్పు ఏర్పడిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం పలుచోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా బలభద్రపురంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో పెను మార్పులు సంభవించాయని, నేడు తీసిన ఛాయా చిత్రాన్ని సెకనులో చూసుకునే వెసులుబాటు వచ్చిందన్నారు. అనంతరం బిక్కవోలు మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. అధ్యక్షుడిగా మరుకుర్తి అశోక్, కార్యదర్శిగా రఘు, ట్రెజరర్‌గా వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీను, ఉప కార్యదర్శిగా కృష్ణారెడ్డిలను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. వీరు ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో అనపర్తి సీఐ సుమంత్,బలభద్రపురం సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సబ్బెళ్ల పురుషోత్తంరెడ్డి, బిక్కవోలు, రంగంపేట, అనపర్తి, రాయవరం మండలాల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్సిస్ మాండ్ డగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు దొండపాటి లాజర్, చిట్టిబాబు, శివ, సుందర్, రమణ పాల్గొన్నారు.

ఉత్తమ ఫొటో జర్నలిస్టులకు సత్కారం

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహతో స్పందించి ప్రజా సమస్యలను ఎత్తిచూపి సమాజ శ్రేయస్సుకు కృషి చేసే వ్యక్తులు ఫొటో జర్నలిస్టులని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోషియేషన్ అధ్యక్షుడు అద్దంకి రాజయోనా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కార్యాలయంలో ఓ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ కేవలం చిత్రాలను బంధించే సాధనం మాత్రమే కాదని, అదొక కళారూపమన్నారు. అనంతరం ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు ఎస్‌బీ రాజేశ్వరరావు, మరో ఫొటో జర్నలిస్టు జీవీవీ ప్రసాద్‌లను గోదావరి బెస్ట్ ఫొటో జర్నలిస్టు పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు శ్రీరామమూర్తి, కుడుపూడి పార్థసారధి, పిన్నమనేని రాంబాబు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ రాజేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము

వేగం పరిమితికి మించితే జరిమానాలే

ఎస్పీ నరసింహ కిషోర్
పోలీసుల ప్రత్యేక డ్రైవ్..
రూ.3 లక్షల జరిమానా

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ద్విచక్ర వాహనాల ఓవర్ స్పీడ్‌కి పోలీసులు బ్రేకులు వేసే ప్రయత్నం మొదలు పెట్టారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా ఓవర్ స్పీడ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. వివిధ అంశాలకు సంబంధించి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు చేస్తున్నామన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ నెల 11నుంచి 17వరకూ స్పెషల్ డ్రైవ్‌లే చేసి పరిమితికి మించిన వేగం, ఇష్టానుసారం డ్రైవింగ్‌లపై 298 కేసులు నమోదు చేసి రూ.3.10 లక్షల జరిమానాలు విధించామని ఎస్పీ నరసింహ కిషోర్ చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


29వ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం 29వ డివిజన్ పరిధిలో మంగళవారం సాయత్రంం ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. శిథిలమైన డ్రైనేజీలు, రోడ్లు, పరిశీలించారు. ఈ సందర్భం గా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రహదారులు, డ్రైనేజీల నిర్మాణ ప నులు చేయాలని నగరపాలక సం స్థ అధికారులకు సూచించారు. ము రుగునీరు రోడ్లపైకి చేరుతున్నట్లుగా స్థానికులు చెబుతున్నారని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. డివిజన్‌లో అన్ని పనులు చేపట్టాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అధికారులకు సూచించారు. ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్థానికులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, రుంకాని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై మాజీ ఎమ్మెల్యేది కపట ప్రేమ

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బీసీ ప్రజా ప్రతినిధులపై లేనిపోని ప్రేమలు ఒలకబోస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డికి వారిపై అంతటి ప్రేమ ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని, నాడు వైసీపీ పాలనలో బీసీ, దళిత ప్రజాప్రతినిధులపై చిన్నచూపు చూపిన ఘనత ఆయనదేనని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనపర్తిలోని కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న జెండా వందనం కార్యక్రమంలో పొలమూరు సర్పంచ్‌ను తాను అవమానించినట్టు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. తాను రామవరం, పొలమూరు పంచాయతీ కార్యాలయాల వద్ద జరిగిన వేడుకలలో పాల్గొన్నానని రామవరంలో వేడుకకు హాజరైన సర్పంచ్ గంగాభవాని జెండా వందనం చేశారని, పొలమూరులో వేడుకకు సర్పంచ్ హాజరు కాకపోవడంతో తాను జెండా ఎగురవేశానన్నారు. పొలమూరు కార్యక్రమానికి సర్పంచ్‌ను హాజరు కాకుండా చేసి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ సానుభూతిపరులుగా ఎన్నికైన బీసీ, దళిత ప్రజా ప్రతినిధులకు ఏ మేరకు గౌరవం ఇచ్చారో వారు ఏర్పాటు చేసిన ఆర్చిలే చెబుతున్నాయని, ఎక్కడా బీసీ, ఎస్సీ ప్రజా ప్రతినిధుల పేర్లు లేకుండా తన అనునాయులైన ఓసీ పెద్దల పేర్లు ఫొటోలు వేయడం ప్రోటోకాల్ అనిపించుకుంటుందా అని రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. సమావేశంలో కూటమి నాయకులు దత్తుడు శ్రీను, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి బులిరెడ్డి, పల్లె శ్రీనివాసరెడ్డి, చిట్టిబాబు చౌదరి, నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, బాచి తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపూడి సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

చైర్మన్ కంటే కేశవరావు


త్రిసభ్య కమిటీని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

కోరుకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి సొసైటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని త్రిసభ్య కమిటీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగకేశవరావు అన్నారు. మంగళవారం బూరుగుపూడి పీఏసీఎస్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్‌గా కేశవరావు, పర్సన్స్‌గా యర్రంశెట్టి సూర్యనారాయణ, బాలిన వెంకటేశ్వర్లు మినిట్స్‌లో సంతకాలు చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సొసైటీ ఆవరణలో సహకార పతాకాన్ని కేశవరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన రైతు సదస్సులో కేశవరావు మాట్లాడుతూ సొసైటీ చైర్మన్ పదవి ఎంతో బాధ్యత కలిగిందని, దానిని సక్రమంగా నిర్వర్తిస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం ఆయనను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఈదల సుదర్శనరావు, డీసీసీబీ బ్యాంక్ కోరుకొండ మేనేజర్ గాజంగం అప్పారావు, జనసేన నాయకులు అడపా వీరబాబు, అడ్డాల శివసూర్యచక్రవర్తి, అడ్డాల శ్రీనివాస్, పోలేపల్లి రామారావు, కన్నాబత్తుల బాలమ్మ, బీవీవీ సత్యనారాయణ, రొంగల శ్రీనివాస్, బత్తుల గోపాలకృష్ణ, అడపా వీరబాబు, కరుటూరి విశ్వనాథం పాల్గొన్నారు.

రూ.9 కోట్ల పంట నష్టపరిహారం చెల్లించాం: బీవీఆర్

కోరుకొండ: కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో రైతులకు రూ.9 కోట్లు పంట నష్ట పరిహారంగా అందజేసినట్టు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. బూరుగుపూడిలో జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ నష్టాల ఊబిలో కూరుకుపోయిన సొసైటీలను గాడిలో పెట్టేందుకు బాధ్యత గల వ్యక్తులతో త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సాగులో సాంకేతిక పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుతం యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నారని, దానికి ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీలను వాడొచ్చని బీవీఆర్ చెప్పారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు అడపా సుధీర్‌కుమార్, వలవల రాజా, మళ్ల అప్పలనర్సారావు, బుద్దా బాపూజీ, గండి విజయ్‌కుమార్, తెలగంశెట్టి శ్రీనివాసు, పెదపాటి భీమరాజు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి మధు


జనసేవాదళ్ వలంటీర్ల శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న మధు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో జరగబోయే సీపీఐ రాష్ట్ర మహాసభలను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆనందనగర్ పార్కు వద్ద రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రజా ప్రదర్శనలో భాగంగా రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతులో పాల్గొనే జనసేవాదళ్ వలంటీర్ల శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ తుపానులు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు సేవా కార్యక్రమాలు చేపట్టడంలో, మతతత్వ శక్తులకు, విచ్ఛిన్నకర, వేర్పాటువాదులకు వ్యతిరేకంగా దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణకు జనసేవాదళ్ వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పి.లావణ్య, పి.త్రిమూర్తులు, రెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్ల పునరుద్ధరణకు కృషి

శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తొలగించబడిన దివ్యాంగుల పింఛన్ల పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. మంగళవారం స్థానిక 3వ డివిజన్‌లో సుబ్బారావు పేటలో 6,7 సచివాలయ కార్యాలయంలో పింఛను అందని బాధితులతో జరిగిన సమావేశంలో ఆయన సత్తిబాబు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి అర్హుల పింఛన్లు కూడా తొలగించిందన్నారు. దివ్యాంగత్వం ఉండి అర్హులైన వారిని గుర్తించి సదరం సర్టిఫికెట్లు జారీ చేసి విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, అధైర్యపడవద్దని సూచించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జక్కంపూడి అర్జున్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

వరుసగా రెండో రోజు ఘటన.. భయాందోళనలకు గురవుతున్న అనపర్తి వాసులు



అనపర్తిలో వీధి కుక్కల దాడిలో గాయపడిన కార్తీక్

అనపర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలో వీధికుక్కల దాడులు అధికం కావడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం అనపర్తిలో వీధి కుక్కల దాడిలో సాత్విక్ అనే బాలుడు గాయపడి రోజు గడవకముందే మసీదు సెంటరుకు చెందిన దంగేటి కార్తీక్‌పై మంగళవారం వీధి కుక్కలు దాడి చేశాయి. కార్తీక్ ఇంటి నుంచి బయటకు వచ్చీ రావడంతోనే కుక్కలు దాడి చేయడంతో కేకలు వేశాడు. దీంతో కార్తీక్ తల్లి కేకలు వేస్తూ కుక్కలను తరిమి కొట్టింది. వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోజు రోజుకు వీధి కుక్కల దాడులు పెరగడంతో గ్రామస్థులు ఒంటరిగా రోడ్డుపైకి రావడానికి భయపడుతున్నారు. ఇక రాత్రి సమయంలో ఐతే పరిస్థితి చెప్పనవసరం లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి మాట్లాడుతూ వీధి కుకకలు దాడి చేసిన కేసులు రోజుకు ఐదారు వరకు వస్తున్నాయని, ఇంజక్షన్లు అందుబాటులో ఉండడంతో వైద్యం అందిస్తున్నామన్నారు. కుక్క కాటును అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యం పొందాలని సూచిస్తున్నారు.

వినాయక ఆలయంలో మృత్యుంజయ హోమం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ఆరోగ్యం కోసం రాజమహేంద్రవరం శ్రీరాంనగర్‌లోని సంకట హరవర సిద్ధి వినాయక ఆలయంలో 42వ డివిజన్ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మళ్ల వెంకట్రాజు ఈ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గన్ని కృష్ణ ఇటీవల కొంత అస్వస్థత గురవ్వడంతో వార్డు కమిటి మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమంలో గన్ని కృష్ణ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, జక్కంపూడి అర్జున్, వానపల్లి శ్రీనివాస్, సింహాద్రి అప్పలరాజు, ఆడారి లక్ష్మీనారాయణ, కేవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన బిక్కవోలు



బిక్కవోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం ఆఖరి మంగళవారం కావడంతో బిక్కవోలులోని ప్రాచీన శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం భక్తులతో పోటెత్తింది.ఈసందర్భంగా భక్తులు కుజ, రజ, సర్ప, కాల దోష నివారణార్థం స్వామికి పూజలు చేశ్చురు. ఈసందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

కడియంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కడియం ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కడియం చైతన్య నగర్ రైల్వే గేట్ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన పొదల్లో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్టు కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం చైతన్య నగర్ రైల్వేగేట్ నుంచి ఉన్న రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. మృతుడు గుండుతో ఉన్నాడని బ్లూకలర్ ఫ్యాంటు ధరించి వున్నాడని రెండురోజుల క్రితం ఈ ప్రాంతంలో మతిస్థిమితం లేకుండా తిరిగినట్టు స్థానికులు చెబుతున్నారని అయితే ఎందుకు మృతిచెందాడో తెలియాల్సి వుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించామని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కడియం స్టేషన్ సీఐ 9440796587, ఎస్ఐ నెంబరు 9347705890లకు సమాచారం అందించాలని కోరారు.





ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు సముద్రంలోకి విడుదల చేసిన వరద నీటి ప్రవాహం

తగ్గుతూ.. పెరుగుతూ..

- ఎగువన పెరుగుతుండగా ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం
- ఎగువన ప్రాణహిత, ఇంద్రావతి నుంచి వస్తున్న వరదనీరు
- ధవళేశ్వరం వద్ద 10 లక్షల క్యూసెక్కుల వరకు రావచ్చని అంచనా

8

వరద సహాయక చర్యలకు ఒక్కో జిల్లాకు రూ.కోటి





ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నేడు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

వర్చువల్‌గా సీఎం.. మంత్రులు నిమ్మల, కందుల హాజరు

రాజమహేంద్రవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు సమీపంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)ని బుధవారం సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్ ప్రత్యక్షంగా హాజరై శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ముఖాముఖి కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఏర్పాటుచేశారు. ఇక్కడ 147 పరిశ్రమల ప్రతినిధులు, 85 స్టార్టప్‌ల ఔత్సాహికులు, 950 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్ ప్రశాంతి మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆర్‌టీఐహెచ్ ద్వారా కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ యాక్సిలరేషన్, పెట్టుబడి, ఫైనాన్సింగ్ వంటి అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువత, పారిశ్రామికవేత్తలు తమ ప్రతిభను ప్రదర్శించుకొనే హబ్‌గా ఆర్టీఐహెచ్ ఉపయోగపడనుందని చెప్పారు. ఆర్టీఐహెచ్ నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలోని ఏర్పాట్లపై సమీక్ష చేసి సమన్వయ శాఖలతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణ నాయక్, డీఆర్డీఏ పీడీ మూర్తి పాల్గొన్నారు.

చేతికి 'స్మార్ట్'గా..





- కొత్త స్మార్ట్ రేషన్ కార్డులొచ్చేస్తున్నాయ్
- ఈనెల 25 నుంచి మండలాల వారీగా పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 17.41 లక్షల పాతకార్డుల స్థానంలో కొత్తవి అందజేత
- ఇటీవల దరఖాస్తు చేసుకున్న వారిలో 34 వేల మంది కొత్త లబ్ధిదారులకూ
- కార్డులపై లబ్ధిదారుడి ఫొటో, కుటుంబ సభ్యుల పేర్లు.. కొత్తవారికీ రేషన్
- ఏటీఎం కార్డు తరహాలో ఉండే రైస్‌కార్డులపై క్యూఆర్ కోడ్‌లు కూడా

ఈనెల 25 నుంచి ఉమ్మడి జిల్లాలో కొత్త స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. పాత, కొత్త లబ్ధిదారు లందరికీ కలిపి ఒకేసారి వీటిని నియోజకవర్గాలు, మండలాల్లో అందించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ ఫొటోతో చాంతాడంత రేషన్‌కార్డు జారీ చేసి వైసీపీ సొంత ప్రచారం చేసుకుంది. దీని స్థానంలో ఇప్పుడు కొత్తగా ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డు ఇవ్వబోతోంది. అచ్చం ఏటీఎం కార్డు తరహాలో ఉండే కార్డులపై కేవలం లబ్ధిదారుడి పేరు, ఫొటో మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. అలాగే కొత్త కార్డుదారులకు సైతం ఈనెల నుంచే రేషన్ పంపిణీ చేయనున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలు పేరుతో ఎడాపెడా లబ్ధిదారులను కోసేశారు. రకరకాల నిబంధనల పేరుతో చివరకు రేషన్‌కార్డులను సైతం భారీగా ఏరేశారు. పలు పథకాలకు రేషన్‌కార్డు అర్హత కావడంతో పెరిగిన ఆర్థిక భారాన్ని తప్పించుకోవడానికి కార్డులను గుట్టుచప్పుడు కాకుండా అప్పటి ప్రభుత్వం ఏరేసింది. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 15.69లక్షల తెల్లకార్డులుండగా, వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లాల పౌరసరఫరాలశాఖలకు పంపి గుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి కార్డులు రద్దుచేసింది. 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో వాటినీ రద్దు చేసేశారు. కొత్తగా వివాహం అయిన దంపతులు, కార్డు ఉండి కొత్తగా పిల్లలున్న వారు ఇలా అనేక విభాగాల్లో కార్డులు జారీ చేయడం, మార్పులు చేర్పులు చేయాల్సి ఉన్నవి వేలల్లో ఉన్నా అదేం పట్టించుకోలేదు. చిరుద్యోగాలు చేసుకునేవారు తమ తల్లిదండ్రుల కార్డుల్లోంచి తమపేర్లు తొలగించాలని కోరినా ఏవేవో కారణాలు చూపి పథకాలను నిలిపివేసింది. దీంతో జనం రేషన్ కార్డుల విషయంలో పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అనేకసార్లు ప్రజలు అప్పట్లో గ్రీవెన్స్‌సెల్‌లో కూడా భారీగా కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్తవి మంజూరు చేయాలంటూ వినతులు అందించినా జగన్ సర్కారు చెవికెక్కించుకోలేదు. మరోపక్క అప్పట్లో ఉన్న రేషన్‌కార్డులను రద్దుచేసి ఏకంగా అప్పటి సీఎం జగన్ ఫొటోతో కార్డులు జారీచేసింది. ప్రతి కార్డుదారుడికి జగన్ ఫొటోతో కాగితం ముక్క చేతిలో పెట్టింది. తద్వారా రాజకీయంగా ఈ కార్డుల ద్వారా లబ్ధిపొందేందుకు ప్రయత్నించింది. అయితే ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టడానికి పచ్చజెండా ఊపారు. అదే సమయంలో రేషన్‌కార్డులను స్మార్ట్ కార్డుల రూపంలో జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర అధికారులు కలిపి ప్రభుత్వ ఆమోదంతో స్మార్ట్‌కార్డుల జారీకి నిర్ణయించారు. ఈ కొత్తకార్డులపై గత ప్రభుత్వం తరహాలో సీఎం బొమ్మ లేకుండా కేవలం కార్డుదారుడి ఫొటోలే ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్డులపై కార్డుదారుడి పేరు, చిరునామా, మిగిలిన సభ్యుల పేర్లు ఉండేలా వీటిని తీర్చిదిద్దారు. ప్రస్తుతం వీటి ముద్రణ దాదాపు పూర్తయింది. వీటిని ఈనెల 23లోగా జిల్లాలకు ప్రభుత్వం పంపనుంది. వీటిని ఈనెల 25 నుంచి జిల్లా స్థాయిలో మంత్రి, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అటు మండలాల్లోను సమాంతరంగా కొత్తస్మార్ట్‌కార్డులను లబ్ధిదారులకు అందించనున్నారు. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో 6,41,533, తూర్పుగోదావరి జిల్లాలో 5,63,089, కోనసీమ జిల్లాలో 5,36,575 కార్డుదారులున్నారు. వీరందరికి కొత్తస్మార్ట్ కార్డులు అందజేయనున్నారు.

మరో 34 వేల మందికి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంత మొత్తుకున్నా పేదలకు కొత్త రేషన్‌కార్డుల జారీ పెద్దగా ఇవ్వలేదు. మార్పులు, చేర్పులను సైతం పట్టించుకోలేదు. దీంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొత్తకార్డులకు ప్రభుత్వం మే 14 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డుల కోసం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించింది. కొత్తగా వివాహం అయినవారు, ఇప్పటివరకు రేషన్‌కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైనవారు.. ఇలా ఏడు రకాల సేవల కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డులు కావాలంటూ వేలాదిమంది దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఉన్నాయి. వీటన్నింటిని సచివాలయాల స్థాయిలో వీఆర్వో నుంచి తహశీల్దార్ల వరకు ఆ అర్జీలను పరిశీలించి మార్పులు చేర్పుల ప్రక్రియ పూర్తి చేశారు. అందులోభాగంగా కాకినాడ జిల్లాకు కొత్తగా 13 వేలు, కోనసీమ 11 వేలు, తూర్పుగోదావరి 10 వేల కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరుచేసింది. వీరికి కూడా ఈనెల 25 నుంచే స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. అటు రేషన్ కూడా ఈ నెల్లోనే కొత్తకార్డుదారులు పొందవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోపక్క, కొత్త రేషన్‌కార్డులను రైస్‌కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. వీటిని పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటికి క్యూ ఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలు ఎలా ఉన్నాయి? డబ్బులు అడుగుతున్నారా? వంటి ఫిర్యాదులను సైతం క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తెలపవచ్చు. ఎలాంటి ప్రచార్భాటం లేకుండా ప్రభుత్వ చిహ్నంతో కార్డుల అందజేతపై హర్షం వ్యక్తమవుతోంది.



ధవళేశ్వరంలో బ్యారేజ్‌పై వరద సరళిని కలెక్టర్ ప్రశాంతికి వివరిస్తున్న ఇరిగేషన్ అధికారులు

వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

ధవళేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల గోదావరికి వరద తరలివస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం కలెక్టర్ పి.ప్రశాంతి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీని సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ గోపినాథ్, హెడ్ వర్క్స్ ఈఈ శ్రీనివాసరావు వరద పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల గోదావరికి వరద తాకిడి పెరిగిందని, మరో రెండు రోజుల్లో మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద ప్రవాహం చేరుకోవచ్చన్నారు. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే పునరావాస కేంద్రాల్లో రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి యంత్రాంగం అప్రమత్తంగా ఉందని ఆమె చెప్పారు.

గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరదలు పెరుగుతున్నందున గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజమహేంద్రవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీకి వరదనీరు 8.29 లక్షల క్యూసెక్కుల పైనే వస్తోందన్నారు. తక్షణమే గోదావరి నది వద్ద ప్రస్తుత నీటిమట్టం, ప్రవాహ వేగం వంటి వాటిని దృష్టిలో పెట్టుకుని నదిలో ప్రమాదకర ప్రదేశాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. తెలంగాణలో కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయడంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ప్రజలెవ్వరు నదిలోపలికి వెళ్లి స్నానాలు చేయొద్దని, యువత సెల్ఫీలు దిగేందుకు నదీ సమీపానికి వెళ్లడం వంటి పనులు చేయొద్దని మంత్రి సూచించారు.



సహస్ర ఘటాభిషేకం

కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఉన్న శ్రీలలితాపార్వతీ సమేత గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రావణమాసం ఏకాదశి, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గోష్పాదేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం చేశారు. ఆ దృశ్యమే ఇది.

8



రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఖైదీతో మాట్లాడుతున్న ఈగల్ చీఫ్ ఐజీ ఆకే రవికృష్ణ

4,200 మంది ఎన్డీపీఎస్‌లో జైలుకెళ్లారు : ఈగల్ ఐజీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఇప్పటివరకు 4,200 మంది జైలుకు వెళ్లి బయటకు వచ్చిన వాళ్లు ఉన్నారని, వారిలో మౌలికమైన మార్పులు తీసుకొచ్చే విధంగా ప్రయత్నిస్తున్నామని ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కేంద్ర కారాగార్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు జిల్లాల్లోని జైళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నామన్నారు. జైలు నుంచి బయటకు వచ్చాక చట్టబద్ధమైన జీవనం, ఎన్‌డీపీఎస్ తదితర కఠిన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. చట్టాలపై అవగాహన లేకపోవడంతో ఎక్కువగా గంజాయి కేసుల్లో ఇరుక్కుంటున్నారన్నారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది విద్యార్థులకు ఎన్‌డీపీఎస్ చట్టంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించే కృషి చేస్తున్నామన్నారు. చాలామంది ఇంజనీరింగ్ విద్యార్థులు గంజాయి కేసుల్లో నమోదు కావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. 375 గ్రామాలను గుర్తించి డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి అవగాహన కల్పించామన్నారు. గంజాయి కేసుల్లో జైలుకెళ్లొచ్చినా మార్పు రాకపోవడంతో 12 కేసుల్లో రూ.13 కోట్ల ఆస్తులను జప్తు చేశామన్నారు. ఈగల్ ఎస్పీ కె.నగేశ్‌బాబు, జైలు సూపరింటెండెంట్ రాహుల్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ పీవీ సూర్య మోహనరావు పాల్గొన్నారు.

ఇవిగో డ్రెడ్జర్లు



కోటిలింగాల రేవులో ఇసుక ర్యాంపు

- టాస్క్‌ఫోర్స్ ఎక్కడ?
- రాత్రుల డ్రెడ్జింగ్ ఇసుకే.. గోదావరి ఒడ్డున గుట్టలు
- ఆగని ఇసుక అక్రమాలు



గాయత్రీ ఇసుక ర్యాంపులో ఎగుమతులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక అక్రమాలు ఆగడం లేదు. ఒకపక్క గోదావరికి వరద వస్తున్నా ఇసుక తవ్వకాలు ఆపడం లేదు. పైగా నిబంధనలకు విరుద్ధంగా పదుల కొద్దీ డ్రెడ్జింగ్ బోట్లలో ఇసుక తవ్వేస్తున్నారు. రాత్రుల సమయంలో డ్రెడ్జింగ్ చేసి, గోదావరి గట్టునే పోగులు పెడుతున్నారు. పైగా డ్రెడ్జర్లను ఆయా ర్యాంపుల సమీపంలోని గోదావరి నది ఒడ్డున చెట్ల చాటున పెడుతున్నారు. కాతేరు, కోటిలింగాల, కొవ్వూరు ఫోర్త్ బ్రిడ్జి సమీపంలోనూ, వెంకటనగర్, గాయత్రీ ర్యాంపులలో యథేచ్ఛగా డ్రెడ్జింగ్ జరుగుతోంది. కొద్దిరోజుల కిందటే మైన్స్ అధికారులు గాయత్రీ, కోటిలింగాల ర్యాంపులలో డ్రెడ్జింగ్ బోట్లను దాడి చేసి పట్టుకుంటే, వాటిని స్వాధీనం చేసుకోవడానికి ఇరిగేషన్ అధికారులు, కేసులు పెట్టడానికి పోలీసులు ఎంత డ్రామా నడిపారో అందరికీ తెలిసిందే. చివరకు గాయత్రీ ర్యాంపులలో పట్టుకున్న డ్రెడ్జింగ్ బోట్లు, వాటికి సంబంధించిన వారిపై ఒన్‌టౌన్ కేసు నమోదైంది. కోటిలింగాల పేటలో అధికంగా డ్రెడ్జింగ్ బోట్లు దొరికినా త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేయడానికి రోజులు గడిపారు. తర్వాత వాటి పరిస్థితిపై ఎవరూ నోరు మెదపలేదు. తర్వాత అయినా అక్రమాలు ఆగాయా అంటే ఆగలేదు. ప్రస్తుతం ఫోర్త్ బ్రిడ్జి మీద నిలబడి కాతేరు, వెంకటనగర్, కోటిలింగాల వైపు ఒకసారి చూస్తే చాలు. పెద్దపెద్ద డ్రెడ్జింగ్ బోట్లు ఒడ్డు పక్కన నీటిలో కనిపిస్తున్నాయి.అక్కడే ఒడ్డుమీద పెద్ద ఇసుక గుట్టలు కనిపిస్తున్నాయి. డీ సిల్టేషన్‌కు అనుమతి ఉంది. ఇసుక తీసుకోవచ్చు. కానీ పడవల మీద వెళ్లి మనుషులతో ఇసుక తీయాలి. దానికి ఖర్చుతో పాటు ఆలస్యం అవుతుందనే కారణంతో ఏవిధమైన అనుమతి లేకుండానే సుమారు 75 డ్రెడ్జర్లను గోదావరిలో డ్రెడ్జింగ్‌కు వినియోగిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు కనీసం స్పందించి ఒకసారి ఆయా ర్యాంపులలోకి వెళ్లి పరిశీలిస్తే అనేక డ్రెడ్జర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడతాయి. నిజానికి అధికారికంగా ప్రభుత్వం నుంచి డ్రెడ్జింగ్‌కు అనుమతి వస్తే ఎవరు ఎలా తవ్వుకున్నా ఎవరికీ ఇబ్బంది ఉండదు. ఇలా అక్రమంగా తవ్వడంతో ప్రజలు రకరకాలుగా విమర్శలు చేస్తున్నారు. ప్రస్తుతం కొవ్వూరు, కాతేరు, వెంకటనగర్, కోటిలింగాల గాయత్రీ ర్యాంపులలో డ్రెడ్జింగ్ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం ఉన్న వరదను కూడా లెక్కచేయకుండా రాత్రుళ్లు డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుకను తోడేస్తున్నారు. ఒక పక్క ఇసుక అమ్మకాలు పెద్దగా లేవని చెబుతున్నారు.కానీ తవ్వకాలు ఆగడం లేదు. మరి ఇసుక అంతా ఎక్కడికి పోతోందో వారే చెప్పారు. ప్రభుత్వం అనుమతించిన స్టాక్ పాయింట్లలో లక్షల కొలదీ టన్నుల ఇసుక ఉంది. కొవ్వూరు వైపు పాపికొండల మాదిరిగా ఇసుక స్టాక్ పాయింట్లు అందరికీ కనిపిస్తూనే ఉన్నాయి.

వర్షాల సమయంలో విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పడుతున్న వర్షాల వల్ల తలెత్తే విద్యుత్ సమస్యలపై ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షం కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగల సమీపాల్లో ఉండరాదని తెలిపారు. తడి చేతుల్లో కరెంటు స్విచ్ ఆన్ ఆఫ్ చేయరాదని, ఇళ్లలో తడినేలపై విద్యుత్ తీగలు, పరికరాలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడివుంటే వాటిని తాకవద్దని, వెంటనే 1912 నెంబరుకి సమాచారం ఇవ్వాలని, వర్షంలో చెట్లు పడినప్పుడు, కరెంట్ తీగలు పడినప్పుడు వాటి దగ్గరకు వెళ్లరాదని, విద్యుత్ స్తంభాల వద్ద గుడారాలు, షెడ్‌లు, టెంట్లు వేయకూడదని, వర్షాకాలంలో మోటారు వినియోగాన్ని తగ్గించుకోవాలని, ఇంట్లో ఫ్యూజ్ లైన్లు సరిగ్గా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని సూచించారు.

214.2 మీమీ వర్షపాతం

అల్పపీడన ప్రభావంతో మంగళవారం జిల్లాలో 214.2 మీమీ వర్షం కురిసింది. గోకవరం మండలంలో అత్యధికంగా 32.2 మీమీ వర్షం కురిసింది. నల్లజర్లలో 28.0 మీమీ, ఉండ్రాజవరంలో 25.4 మీమీ, పెరవలిలో 21.8 మీమీ, తాళ్లపూడి 21.4 మీమీ, కోరుకొండ 14.4 మీమీ, రాజానగరంలో 12.6మీమీ, నిడదవోలులో 10.2 మీమీ, గోపాలపురంలో 9.8మీమీ, సీతానగరంలో 9.0 మీమీ, రంగంపేటలో 8.4 మీమీ, దేవరపల్లిలో 7.8 మీమీ, చాగల్లులో 3.6 మీమీ, అనపర్తిలో 3.0 మీమీ, కడియంలో 2.8మీమీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 1.6 మీమీ, రాజమహేంద్రవరంలో 1.4 మీమీ, బిక్కవోలులో 0.4 మీమీ, కొవ్వూరులో 0.4 మీమీ వర్షం కురిసింది. సగటున 11.3 శాతం పడింది.

రాగోలపల్లి సొసైటీ కార్యదర్శి భాస్కరరావు సస్పెన్షన్

తాళ్లపూడి, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం రాగోలపల్లి సొసైటీ కార్యదర్శి కింతాడ భాస్కరరావును సస్పెండయ్యారు. కొవ్వూరు డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఆదేశాలు జారీ చేశారని సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్ తెలిపారు. ఇంచార్జి కార్యదర్శిగా తాళ్లపూడి సొసైటీ కార్యదర్శి బి.రామచంద్రాన్ని నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయని, ఆయన మంగళవారం బాధ్యతలు తీసుకున్నారని చెప్పారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ వివరాలు తెలియజేశారు. కార్యదర్శి భాస్కరరావు సొసైటీ పరిపాలనలో బంగారు రుణాలు, రైతులకు ఇచ్చిన రుణాల విషయంలో అవకతవకలకు పాల్పడడంతోపాటు సొసైటీ కార్యకలాపాల్లో నిర్లక్ష్యం తదితర అంశాలపై వచ్చిన ఆరోపణలతో డీఎల్‌సీవో ఆదేశాలతో సస్పెండ్ చేశారని తెలిపారు. గత నెలలో రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సొసైటీలో జరిగిన అవకతవకలపై బ్యాంకు ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో సెక్షన్ 51 ప్రకారం విచారణ సాగుతోందని సొసైటీలో ఆడిట్ చేస్తున్న కె.సుబ్బారావు తెలిపారు. విచారణ సమయంలోనే అవకతవకలకు పాల్పడ్డ కార్యదర్శిని తొలగించాలని, నూతనంగా పదవిలోకి వచ్చిన త్రీమెన్ కమిటీ.. అధికారులను కోరడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు డీఎల్‌సీవో వెంకటరమణ జారీచేశారని తెలిపారు. విచారణ అనంతరం కార్యదర్శి కింతాడ భాస్కరరావుపై చర్యలు తీసుకుంటారని ఆడిటర్ సుబ్బారావు తెలిపారు. కొత్త పదవీ బాధ్యతలు చేపట్టిన తాము రైతుల శ్రేయస్సు కోసమే పనిచేస్తామని అనపర్తి ప్రసాద్, కమిటీ సభ్యుడు బాలం చంద్రరావు తెలిపారు.



వివరాలు తెలియజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్, బ్యాంక్ ఆడిటర్ కె సుబ్బారావు

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ దిగువన ప్రవహిస్తున్న వరద నీరు



పోచవరం, తాడిపూడి గ్రామాల రహదారిలో కొవ్వాడ కాలువ ప్రవాహం కారణంగా కంచె వేయిస్తున్న తహసీల్దార్

తగ్గుతూ పెరుగుతున్న గోదావరి

- ఎగువన పెరుగుతుండగా ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం
- ఎగువన ప్రాణహిత, ఇంద్రావతి నుంచి వస్తున్న వరదనీరు
- ధవళేశ్వరం వద్ద 10లక్షల క్యూసెక్కుల వరకు రావచ్చని అంచనా

ధవళేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి తగ్గుతూ పెరుగుతూ ప్రవహిస్తోంది. ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి పరివాహకం ఎ నుంచి వరదనీరు గోదావరికి చేరుతూ ఉండటంతో ఎగువ ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టం పెరుగుతూ ఉండగా ధవళేశ్వరంవద్ద గోదావరి తగ్గుతూ ప్రవహిస్తోంది. ధవళేశ్వరంవద్ద కాటన్ బ్యారేజ్ నుంచి మంగళవారం ఉదయం 6గంటలకు అత్యధికంగా 8,23,083క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండగా నీటిమట్టం 10.40 అడుగులకు చేరుకుంది. ఆపై మధ్యాహ్నం 11గంటల వరకు అదే రీడింగ్ వద్ద నిలకడగా కొనసాగిన నీటిమట్టం తరువాత తగ్గుముఖం పడుతూ సాయంత్రానికి 9.90 అడుగులకు చేరుకోగా కాటన్ బ్యారేజ్ ద్వారా7,40,578 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయానికి 10లక్షల క్యూసెక్కుల వరకు ప్రవాహం తరలిరావచ్చని ఫ్లడ్‌సెక్షన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలంవద్ద సోమవారంరాత్రి 8గంటల వరకు పెరిగిన నీటి మట్టం 38.30 అడుగులకు చేరుకుంది. ఆపై క్రమంగా తగ్గుతూ మంగళవారం మధ్యాహ్నానికి 36అడుగులుగా నమోదైంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో మధ్యాహ్నం 4గంటల నుంచి నీటిమట్టంలో పెరుగుదల నమోదై సాయంత్రానికి 36.30అడుగులకు చేరుకుంది. ఈ పెరుగుదల మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు పైగా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఒక్కో జిల్లాకు రూ.కోటి

• సురక్షిత ప్రాంతాలకు వరద బాధితులను తరలించాలని సూచన

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బాధిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా నిధులు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాకు రూ.కోటిచొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.3 కోట్లు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో వర్షాలు, వరద ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, వైద్య సేవలు అందించాలని కలెక్టర్లను ఆదేశం చింది. ఆర్టీసీ బస్సులను తరలించి వరద ముప్పు ఎక్కువగాఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించింది. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ సంస్థ అధికారులు వర్షాలు, వరద ముప్పు ప్రాంతాల జిల్లాల కలెక్టర్లతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు. అటు గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కోనసీమ జిల్లాలో నాలుగు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

నదిలో స్నానాలు, చేపల వేట నిషేధం

• కొవ్వూరు తహసీల్దార్ దుర్గాప్రసాద్

కొవ్వూరు: నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ రాష్ట్రాలలో వర్షాలు అధికంగా కురవడంతో గోదావరి ఉపనదులు, కాలువలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వరద ప్రవాహం నదిలో చేరడంతో కొవ్వూరు, రాజమహేంద్రవరం మధ్య అఖండ గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులను, స్నానాలు చేయడానికి దిగవద్దని, నదిలో బట్టలు ఉతకడం నిషేధించామని తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణ, మండలంలో రెవెన్యూ సిబ్బంది ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. మంగళవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరద ఉధృతిని తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవ్వరూ గోదావరిలో స్నానాలు చేయడానికి దిగకుండా స్నానఘాట్టాల వద్ద పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. మరింత వరద పెరిగితే రెవెన్యూ సిబ్బందితో షిఫ్టుల వారీగా టీమ్‌లు ఏర్పాటుచేస్తామన్నారు.



గోదావరి బండ్ పరిరక్షణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



పెరవలి: తీపర్రు పుష్కర రేవు వద్ద గోదావరి వరద

మద్దూరులంకలో గోదావరి బండ్ పరిరక్షణ పనులు ప్రారంభం

కొవ్వూరు మండలం మద్దురులంకలో గోదావరి వరద ఉధృతిని మంగళవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. గ్రామస్థులు, అధికారుల నుంచి వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గోదావరి బండ్ పరిరక్షణ నిధి నుంచి మంజూరైన రూ.5లక్షల పనికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గోదావరి వరద మరింత పెరిగితే నది నుంచి గ్రామంలోకి వరద ప్రవాహం వచ్చే ప్రాం తాలను పరిశీలించారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నదిలో వరద ఉధృతి అధికంగా ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, కప్పల సుదర్శన్, ఆకుల వీర్రాజు, బొలిశెట్టి దుర్గారావు, సొసైటీ అధ్యక్షులు చావా శ్రీనివాస్, సుంకర సత్తిబాబు, నాయుడు వీర్రాజు, సర్పంచ్ జెట్టి బంగారయ్య, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మునుగుతున్న లంక భూములు...

పెరవలి: గోదావరి వరద క్రమంగా పెరుగుతోంది. ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలతో రెండురోజుల్లోనే ఒక్కసారిగా వరద పెరిగింది. గతంలో జూన్, జూలై నెలల్లోనే గోదావరి వరద లంక భూములను ముంచేది. ఈ ఏడాది ఆగస్టు నెల సగంపైగా పూర్తయినా వరద పెద్దగా రాకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం వరద ఎక్కువగా వస్తుండటంతో కింది లంక భూములు నీటమునిగాయి. పంటలకు ఇబ్బంది లేకపోయినా పచ్చగడ్డి భూములు నీటమునిగాయి. దీంతో పశువులకు పచ్చగడ్డికి ఇబ్బంది అవుతుందని రైతులు వాపోతున్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంవద్ద పరవళ్లుతొక్కుతున్న గోదావరి

ఉధృతంగా కొవ్వాడ కాలువ

తాళ్లపూడి: అధికవర్షాల ప్రభావంతో ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పోచవరం, తాడిపూడి గ్రామాల మధ్య రహదారిలో కొవ్వాడ కాలువ ఉధృతి పెరిగి పొంగి పొర్లుతుండటంతో ఆ ప్రదేశాలను పరిశీలించి ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా తహసీల్దార్ లక్ష్మీలావణ్య కంచెవేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. కొవ్వాడ ప్రవాహంవలన రైతులకు, ప్రజలకు రాకపోకలలో అంతరాయం ఏర్పడుతుంది. ఈ సందర్భంలోనే తహసీల్దార్ ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మా ట్లాడుతూ కొవ్వాడ ఉధృతి తగ్గే వరకూ ప్రజలందరూ అధికారుల ఆదేశాలు పాటించాలని ఈ రహదారిలో ఎవ్వరూ ప్రయాణం చేయరాదని అన్నారు. గ్రామ సర్పంచ్ కాకర్ల ఏర్పా టుచేసిన కంచెవద్ద సిబ్బందిని నియమించారు. వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటంటి: డీవైఎఫ్ఐ

నిడదవోలు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించేందుకు ప్రతిఒక్కరూ పచ్చదనం పరిరక్షణకు కృషిచేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గారపాటి ప్రసన్నకృష్ణ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని వైఎస్సార్ కాలనీ, జగనన్న కాలనీల్లో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు.

కార్యక్రమంలో ఎండీ షానూ, సత్యనారాయణ, ఎస్‌కె సుభానీ, పోలుమాటి మూర్తి, బి.సత్తిబాబు, ఎస్‌కె సలీమ్, ఎస్‌కె కరీమ్, ఎస్‌కె షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

• డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ఆపై గోదావరినదికి వరదల సమయం కావడంతో ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన మంగళవారం మండలంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను సందర్శించారు. ప్రక్కిలంక గ్రామంలో ఆం జనేయస్వామి ఆలయంవద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరం వద్ద డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మండలంలో తాళ్లపూడి, అన్నదేవరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వర్షాకాలం కారణంగా ప్రజల ఆరోగ్య రీత్యా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని అన్నారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ హారికాగుప్త, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రక్కిలంకలో వైద్య శిబిరంవద్ద డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు సిబ్బంది

• మండలంలోని ప్రక్కిలంక గ్రామంలోని స్మార్ట్ ఆసుపత్రులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. మం డలంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులను సందర్శించిన అనంతరం ప్రైవేటు ఆసుపత్రు లను సందర్శించి వారు అందించే సేవలు, సదు పాయాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా వచ్చే మలేరి యా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై పలు సూచనలు చేశారు. ఆసుపత్రి యాజమాన్యం పి.నరసింహమూర్తి, డాక్టర్ చరన్, డాక్టర్ భవ్య, వైద్య సిబ్బంది కృపావరం పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీపై సెన్సూర్ జరిమానా

• ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

కొవ్వూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ టి.శ్రీనివాసులపై సెన్సూర్ జరిమానా విధించినట్టు ఎక్స్ అఫిషియో స్పెషల్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కొవ్వూరు ఏఎంసీలో సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా పనిచేసిన టి.శ్రీనివాసులు ప్రస్తుతం కాకినాడ జిల్లా కరప ఏఎంసీలో సెక్రటరీగా పనిచేస్తున్నారు. రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఉన్న రెండు ఎగ్జిక్యూటివ్ పిటిషన్ కేసుల్లో ఉత్తర్వులు ఉన్నా ప్రతివాది జీతం అటాచ్‌మెంటు చేయడంలో విఫలమైనందుకు సెక్రటరీ శ్రీనివాసులుపైనా అభియోగం మోపారు. భవిష్యత్‌లో ఇటువంటి తప్పులు పునరావృత్తం కాదని సెక్రటరీ హామీ ఇవ్వడంతోపాటు ఆర్టికల్ ఆఫ్ చార్జి నుంచి విముక్తి చేయాలని కోరారు. మొత్తం విషయాలను పరిశీలించిన అనంతరం ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనలు నియమం 9 ప్రకారం శ్రీనివాసులపై సెన్సూర్ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

గోపవరంలో పలువురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

నిడదవోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం గోపవరం గ్రామంలో సోమవారంరాత్రి సర్దార్ పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని కొంతమంది బాణా సంచాకాల్చి వేడుకలు నిర్వహించారు. సమీపంలోని కండవల్లి శ్యామ్‌బాబు ఇంటిపై తారాజువ్వ పడటంతో అతను ప్రశ్నించగా అతనిపై వేముల నాగేంద్ర, ఆరేపల్లి దిలీప్‌కుమార్, వేముల లక్ష్మణసాయి, ఆరేపల్లి గాంధీలతోపాటు మరికొంత మంది దాడి చేశారు. కండవల్లి శ్యామ్‌బాబు తలకు గాయమైంది. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడిచేసిన నలుగురితో పాటు మరికొంతమందిపై సమిశ్రగూడెం పోలీసులు హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ దేవకుమార్, సీఐ పీవీజీ తిలక్, ఎస్ఐ బాలాజీ సుందరరావులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కొవ్వూరు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని 18మంది లబ్ధిదారులకు రూ.5,83,343ల విలువైన చెక్కులను లబ్ధిదారులకుఅందజేశారు. అరికిరేవుల,కాపవ రం, ధర్మవరం, తోగుమ్మి, పెనకనమెట్ట, కు మారదేవం, పంగిడి, మద్దూరు, మద్దూరులంక నందమూరులో చెక్కులు అందజేశారు.

గోష్పాదేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం



గోష్పాదేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం చేస్తున్న పండితులు, పాల్గొన్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గోష్పదేశ్వరస్వామికి భక్తులు సహస్ర ఘటాభిషేకం చేశారు. కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పా ఠశాల ప్రాంగణంలో ఉన్న శ్రీలలితాపార్వతీ సమేత గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో మంగళవారం శ్రావణమాసం ఏకాదశి, ఆరుద్రనక్షత్రాన్ని పురస్కరించుకుని భక్తులు ఆలయ ప్రాంగణంలో శివమానస సరోవరంలో(కోనేరు) నీటిని రాగి బిందెలతో తీసుకువచ్చి గోష్పదేశ్వరస్వామిని అభిషేకించారు. ఆర్డీవో రాణి సుస్మిత పాల్గొని గోష్పదేశ్వరస్వామికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మోటార్ కేబుల్ దొంగతనాలు

• యువకుడిని పట్టుకున్నరైతులు

• పోలీసులు పట్టించుకోవట్లేదని రైతుల ధర్నా

నల్లజర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వ, పూళ్లకు చెందిన ముగ్గురు యువకులు మంగళవారంరాత్రి 6గం టలకు నల్లజర్లకు చెందిన రైతులు కండెపు సుబ్బారావు, రాయుడు ప్రసాద్ పొలంలో మోటార్ కేబుల్ కట్ చేస్తుండగా జగన్నాథపురం గ్రామానికి చెందిన కళ్లెం రామకృష్ణ చూసి రైతులను అప్రమత్తం చేసి పట్టుకున్నారు. మోటార్ కేబుల్ వైర్లు కత్తిరిస్తుండగా రైతులు ముగ్గురి యువకులను పట్టుకునే ప్రయత్నం చేయగా ఇద్దరు పారిపోగా ఒకరిని పట్టుకుని నల్లజర్ల పోలీసులకు అప్పగించారు. పోలీసుల నుంచి సరియైన స్పందన రాకపోవడంతో రైతులు స్టేషన్ ముందు కూర్చొని ధర్నా చేశారు. దొంగతనం చేసే యువకులను పట్టుకోవాలని రైతులు కోరుతుంటే స్టేషన్‌కు వచ్చిన రైతులను పోలీసులు వీడియో తీసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు ఏదో గ్రామంలో మోటార్ కేబుల్స్ దొంగత నాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని, తాము పట్టుకున్న దొంగలను సైతం విచారించకుండా మేము చూసుకుంటాం మీరు వెళ్లిపోండి అంటూ పోలీసులు చెబుతున్నారని, మొన్న పుల్లలపాడు రైతులు ఇద్దరు యువకులను పట్టుకుని పోలీసులకు అప్పగించిన కేసులు లేకుండా వారిని పంపించి వేశారని, ఇప్పుడు అదే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగు ప్రారంభించిన రైతుల మోటార్లకు ఉన్న విలువైన కేబుల్‌ను కట్ చేయడం ద్వారా మోటార్‌నుపైకి తీసి మొత్తం కేబుల్ వేయాల్సి వస్తోందని, దీనికి వేల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. దీనిపై నల్లజర్ల సీఐ బాలసౌరి వివరణ కోరగా దువ్వకు చెందిన ఒక వ్యక్తిని రైతులు అప్పగించారని మిగిలిన వారి కోసం ఒక బృందాన్ని పంపించినట్లు చెప్పారు.

ఇంట్లో ఉరేసుకుని వ్యక్తి మృతి

కొవ్వూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన వాడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన రాజమండ్రి వీర వెంకటరమణ(40) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో తలుపులు వేసుకుని పడుకున్నాడు. భార్య దుర్గ పిల్లల ను స్కూల్‌కి పంపించి గ్రామంలోనే పుట్టింటి కి వెళ్లి సాయంత్రం వరకు రాలేదు. ప్రక్కనే ఉంటున్న వెంకటరమణ అన్న నరేంద్రకుమార్ తమ్ముడు ఇంటికి వచ్చి ఇంట్లోకి వెళ్లిన వ్యక్తి సాయంత్రం అయిన బయటకు రాకపోవడంతో తలుపులు కొట్టాడు. తీయకపోయేసరికి బలవంతంగా తలుపులు తెరిచేసరికి వెంకటరమణ సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించినట్లు నరేంద్రకుమార్ తెలిపాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడు రాజమహేంద్రవరంలో పురుగుల మందుల షాపులో పనిచేసేవాడు. కొంత కాలంగా పనిమానేసి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఆత్మహత్య చేసుకుని మృతి చెందడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. దీని పై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.



మృతుడు రాజమండ్రి వీర వెంకటరమణ

యూరియా అధికంగా వాడొద్దు

• వ్యవసాయశాఖ జిల్లా అధికారి మాధవరావు

నిడదవోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతాంగం ఎరువుల వాడకంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మంగళవారం నిడదవోలు మండలం శింగవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను ఎక్కువ మంది రైతులు నీటిలో చల్లుతున్నారని నీరు ఉన్నప్పుడు యూరియా చల్లడం వలన అది ఆవిరి రూపంలో నీటిలో పక్కనున్న పంట పొలాలకు వెళ్లి వృథా అవుతుందన్నారు. యూరియాను రైతులు బురదలో వేసుకోవాలని అన్నారు. కొవ్వూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ చేయించుకోవాలని అన్నారు. నిడదవోలు మండల వ్యవసాయ శాఖాధికారి జి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.



నిడదవోలులో మాట్లాడుతున్న మాధవరావు



కొవ్వూరు: పంగిడిలో ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆరుతడి పంటలతో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చు

• జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు

కొవ్వూరు: ఆరుతడి పంటలతో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు అన్నారు. కొవ్వూరు మండలం పంగిడిలో మంగళవారం రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ఆరుతడి పంటలలో నీటిని తక్కువగా అందించడంతో పంటలకు ఎటు వంటి తెగుళ్లు సోకవన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాటివలన కలిగే ఉపయోగాలు వివరించారు. ఈ పద్ధతిలో నీరు, విద్యుత్ ఆదా, 50 శాతం మిథేన్ వాయువును తగ్గించవచ్చునన్నారు. జీవామృతం, బయోచార్‌ల తయారీ విధానం, ఉపయోగాలను తెలియజేశారు. జిల్లా జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి మాట్లాడుతూ ఆరుతడి వ్యవసాయం రైతులకు ఉపయోగం అన్నారు. డెల్టా ప్రాంతంలో నీటిని ఎక్కువగా వినియోగిండంతో తెగుళ్ల బెడద ఉంటుందని, సక్రమంగా నీటితడులుతో తెగుళ్లు తగ్గించి మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. గ్రామ హర్టికల్చర్ అసి స్టెంట్ రంజన్, యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, ఐసీఆర్‌పీలు వెంకటేశ్వరరావు, వెంకట్రావు, మమత, పార్వతి, వీరమణి, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

నల్లజర్ల: రైతులు రసాయన ఎరువుల మోతాదు తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ఏవో సోమశేఖర్ అన్నారు. మంగళవారం పుల్లలపాడులో పోలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఆర్గానిక్ ఎరువుల తయారీ, కాషాయాలు, జీవామృత ఎరువులు ఏలా తయారు చేసుకోవాలి అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో ఆరుతడి విధానంలో లాభాలు

చాగల్లు: వరిలో ఆరుతడి సాగువిధానంలో అవగాహన కార్యక్రమం మంగళవారం మండంలోని మల్లవరంలో జరిగింది. ఈశిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ వలిమా ట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులు సాగు చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి, ఐసీఆర్‌పీలు శ్రీనివాస్, పోలవేణి, రత్నకుమారి, రైతులు పాల్గొన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండండి

• ఐజీ, ఈగల్ చీఫ్ రవికృష్ణ

దివాన్‌చెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డ్రాగింగ్ వ్యతిరేక వారోత్సవం, ఈగల్ డ్రగ్స్ చైతన్య కార్యక్రమం మంగళవారం జరిగింది. దీనికి ఐజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తాను రాజమహేంద్రవరంలో పుట్టి పెరిగి, ఇక్కడే విద్యాభ్యాసం పూర్తిచేశానని, నన్నయ యూనివర్శిటీకి రావడం ఆనందంగా ఉందన్నారు. నేటి సాంకేతిక యుగంలో భయం, దురాశ, వ్యామోహం, అవమానం వంటివి సైబర్‌నేరాల పెరుగుదలకు కారణాలు అవుతున్నాయని చెప్పారు. దీని పట్ల యువత అవగాహన కలిగి ఉండి సమాజానికి, పెద్దలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాలపై సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 1930కు తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో నేరాలకు అడ్డాగా ఉన్న ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని పదేళ్ల నుంచి నేరాలు లేకుండా అరికట్టి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత విషయంకాదని, కుటుంబాల భవిష్యత్తును క్షీణింపజేసే సామాజిక అంటువ్యాధి అని అన్నారు. ఈగల్ ఎస్పీ కె.నగేష్‌బాబు మాట్లాడుతూ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను ఐజీ నివృత్తి చేశారు. డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటామని, వాటి జోలికి పోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ రూపొందించిన డ్రగ్స్, సైబర్‌నేరాల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ కేవీ స్వామి, సౌతోజోన్ డీఎస్పీ భవ్యశ్రీ, ఈగల్ డీఎస్పీ పి.సూర్యమోహనరావు, నన్నయ డీన్ ఆచార్య ఎన్.ఉదయభాస్కర్, న్యాయాధికారి నాగేంద్ర పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

• ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

కొవ్వూరు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్లు మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గెల్లా రాజబాబు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని కొవ్వూరు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని. లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు యు.శ్రీను, పి.రవి, శ్రీనువాసు, బి.పోసిరత్నం, మనీ, శశి, శివాజీ, కాజా, ఫణీంద్ర, విజయకుమార్ పాల్గొన్నారు.

దేవరపల్లి: ఫొటోగ్రాఫర్లు వృత్తినైపుణ్యాన్ని పెంపొందించుకుని దేశంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఫొటోఅండ్ వీడియోగ్రాఫర్ల మండలాధ్యక్షుడు కె.రామకృష్ణ పేర్కొన్నారు. దేవరపల్లిలో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్విస్ మాండ్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకుకట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఫొటోగ్రాఫర్ల సంఘం ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్యదర్శి చందన చిన్న, సహాయకార్యదర్శి కొమ్మన సాయి, కోశాధికారి వై.సునీల్, సంఘ సభ్యులు గేలం దుర్గాప్రసాద్, అజయ్, సురేశ్ పాల్గొన్నారు.



డాగూరేకు నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

వినాయక ఉత్సవాల్లో

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

• కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. ఈ పండుగను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసుశాఖ గణేష్ మండపాలు ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులకు నియమ నిబంధనలు విడుదల చేసింది. గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వాహకులు ముందుగానే కమిటీలు ఏర్పాటుచేసుకుని అన్ని ఏర్పాట్లకు పూర్తిగా బాధ్యత వహించాలి. పబ్లిక్ ప్రదేశాలలో, రోడ్లపై మండపం ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. ప్రైవేటు ప్రదేశాలలో విగ్రహాలను ప్రతిష్ఠించేవారు స్థలం యజమాని నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అనుమతి పొందాలి. విగ్రహాల ఎత్తు 5 అడుగులు మించరాదు. ట్రాఫిక్‌కి, ప్రజలకు ఎటువంటి అంతరాయం కలుగకూడదు. మైక్ కోసం సంబంధిత డీఎస్పీ నుంచి అనుమతి పొందాలి. డీజే సౌండ్ బాక్సులకు అనుమతి లేదు. రాత్రి 10 గంటలు తరువాత ఎలాంటి కార్యక్రమాలు జరుపరాదు. హుండీలు, ఆభరణాలు, లడ్డూ ప్రసాదంకు పూర్తిగా కమిటీ బాధ్యత వహించాలి. మండపాలవద్ద సీసీ కెమెరాలు తప్పనసరిగా అమర్చాలి. ఇతరమతాల ప్రజలకు, వారిప్రార్థనా మందిరాలకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు చూసుకోవాలి. ఈనెల 27వ తేదీ వినాయక చవితి నుంచి 11 రోజులలోపే నిమజ్జనాలు పూర్తిచేయాలి. 11 రోజుల తరువాత నిమజ్జనాలు అనుమతించరు.

